ENTERED

స్నేహ

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 19, 2010

వికీలీక్స్ విస్ఫోటనం

హ్యాపీ బర్త్‌డే

(2010 డిసెంబర్ 19 నుంచి 2010 డిసెంబర్ 25 వరకు)

ఆర్. భానుశ్రీ
2సం॥,డిసెంబర్-20
పారిజాత-యాదగిరి
శ్రీశ్రీనగర్-రంగారెడ్డి

ఎస్. అంషద్ ఫర్హీన్-సాథిక్ నాయబ్
3సం॥,డిసెంబర్-1సం॥,డిసెంబర్
ఆసిఫా-జమలుల్లా
గూడూరు-నెల్లూరు

వై.గౌతమి
6సం॥,డిసెంబర్-22
సాయిలక్ష్మి-శ్రీనివాస్
శ్రీకాకుళం

జతిన్
డిసెంబర్
వేణు-వెంకటేశ్వరరావు
హనుమంతపురం-కృష్ణా

జస్వంత్ రాల్ఫ్
8సం॥,డిసెంబర్-24
బ్యూలా-శ్యాంబాబు
బాబాబృందావనకాలనీ-కర్నూలు

హర్షిత
2సం॥,డిసెంబర్-2008
మాధవి-రాజు
గాంధారి-నిజామాబాద్

ఎం.డి.సోహేల్‌యూనఫ్
6సం॥,డిసెంబర్-2004
షబానా-అక్బర్
దోమల్‌గూడ-హైదరాబాద్

జె.దీక్షిత
1సం॥,డిసెంబర్-24
చామంతి-రాజు
ముషీరాబాద్-హైదరాబాద్

కె. మనస్విని
డిసెంబర్-22
స్వరూప-సతీష్
ప్రజ్ఞాపూర్-మెదక్

జె. జయకృష్ణ
9సం॥,డిసెంబర్-2001
సత్యవతి-అప్పారావు
చోడవరం-విశాఖ

కె. నన్ని ప్రసాద్
9సం॥,డిసెంబర్-2001
ప్రేమలత-జంగయ్య
నందివనపర్తి-రంగారెడ్డి

ఎన్.కె.మయాంక్
4సం॥,డిసెంబర్-23
షాహీనాబేగం-జానీ
రామంతపూర్-హైదరాబాద్

శివ మణికంఠ
డిసెంబర్
అన్నపూర్ణ-సూర్య నాగేశ్వరరావు
రావులపాలెం-పశ్చిమగోదావరి

ఎ.అపురూప
డిసెంబర్
అనురాధ-అనిల్‌కుమార్
కందుకూరు-ప్రకాశం

వరుణ్ నందేశ్
2సం॥,డిసెంబర్-2008
జ్యోతి-సాంబశివరావు
కృష్ణాజిగూడెం-వరంగల్

మనలో మాట

డై...రీ...



కొత్త సంవత్సరం ఎప్పుడూ కొత్తే. కొత్త కొత్త నిర్ణయాలు, కొత్త ఆలోచనలు... కొనగలిగితే కొత్త బట్టలూ, కొత్త వస్తువులూ ... కొత్త సంవత్సరమంటూ తీసుకొన్న నిర్ణయాల అమలుపట్ల బోలెడు అపనమ్మకమున్నా, వచ్చే సంవత్సరం నిజంగానే కొంగొత్తగా కనిపిస్తుంది! మనిషి ఆ మాత్రం ఆశాజీవి కాకపోతే బతుకు కష్టమౌతుంది మరి. కొత్త సంవత్సరపు కొత్త వస్తువుల జాబితాలో డైరీ చాలా ప్రధానమైనది.

డైరీ ఒక్కొక్కరికి ఒక్కోలా ఉపయోగపడుతుంది. వయసును బట్టి, వృత్తిని బట్టి, స్వభావాన్ని బట్టి వినియోగించే తీరు మారుతూ ఉంటుంది. కొంతమంది దాన్లో ప్రేమ కవిత్వం రాసుకుంటారు. ఆ మరుసటి సంవత్సరం అది పిల్లలకు చిత్తు పుస్తకంగా ఉపయోగపడుతుంది. కొందరికి డైరీ పద్దుల పుస్తకం. కొందరికి సమావేశాల మినిట్సు. ఇంకొందరికి ఎప్పుడేం చేయాలో చెప్పే రిమైండర్! స్కూలు పిల్లల డైరీలో హోంవర్కులూ, క్లాసువర్కులే ఉంటాయి. కాలేజీ డైరీల్లో కవిత్వం మొదలవుతుంది. పెళ్లయిన కొత్తలో అన్నీ తీపి ఊసులే ఉంటాయి. సామాన్యుడి డైరీలో ఖర్చూ ఆదాయాల మధ్య జరిగే కుస్తీలూ కసరత్తులూ కనబడతాయి.

అప్పుడప్పుడు సినిమాల్లో డైరీలు కీలకపాత్ర పోషిస్తాయి. డైరీ పేజీల్లాగానే సినిమా రీళ్లు తిరుగుతాయి. ఊహించని మలుపులు... ఊరట చెందే మార్పులూ డైరీ ద్వారానే సంభవిస్తాయి. మనిషి చెప్పని మాట డైరీ చెబుతుంది. అద్దం అబద్ధం చెప్పదని నమ్మినట్టే- డైరీ కూడా అసత్యం పలకదనే విశ్వాసం చలామణి అవుతోంది! ఈ కారణంగానే చాలామంది రాసిన డైరీలు సంచలనాలు సృష్టిస్తాయి. హవాలా కేసులో ఎవరికి ఎంతెంత ముట్టచెప్పారో డైరీలే చెప్పాయి. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీల దురాగతాలను అన్నే ఫ్రాంక్ అనే బాలిక రాసిన డైరీలు లోకానికి చాటాయి. పోలీసు దర్యాప్తులో డైరీకి మించిన సాధనం మరొకటి ఉండదు. ఇందువల్లే- కొంతమందికి డైరీలంటే భయం! ముఖ్యంగా నీతీ రీతీ లేని రాజకీయాలు నడిపేవాళ్లకు. నిజాలను అక్షరాలుగా ఆవిష్కరిస్తే ఎంత ప్రమాదమో వాళ్లకు తెలుసు.

అలాంటివాళ్ల మాటకేం కానీ- మామూలుగా డైరీ రాయడం మంచి అలవాటు. మంచిచెడ్డల్నీ, పెరుగుతరుగుల్నీ ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవడానికి డైరీ ఉత్తమ సాధనం. జ్ఞాపకం పెట్టుకోలేని తారీఖులకు, దస్తావేజులకు డైరీని మించిన సౌలభ్యం వుండదు. కాలచక్రాన్ని మనం ఎప్పుడూ వెనక్కి తిప్పలేం. కానీ, డైరీ ద్వారా అలాంటి అనుభూతిని పొందొచ్చు. డైరీల్లో వ్యక్తిగతానికి సామాజిక సందర్భాలనూ అన్వయిస్తే- మనం ఒక చారిత్రిక సాక్షిలా నిలబడవచ్చు. గొప్ప నాయకులు కొంతమంది డైరీల ఆధారంగా తమ ఆత్మకథలతోపాటు ప్రజాఉద్యమాలను కూడా అక్షరబద్దం చేశారు. *ఒకానొక చారిత్రిక దశలో సామాన్యుడి స్పందన ఎట్టిది?* అని వందేళ్ల తరువాత ఎవరైనా ప్రశ్నిస్తే- మన డైరీ సమాధానం చెప్పొచ్చు. కొందరు రాయని భాస్కరులుంటారు. డైరీలకోసం తెలిసిన వాళ్ల ప్రాణం తీస్తారు. పీడించి సాధించిన డైరీపై పేరు, ఊరు గట్రా చక్కగా రాసేస్తారు. మళ్లీ దాన్ని తెరిస్తే ఒట్టు. మనసు చంపుకొని రెండేళ్ల తర్వాత లాండ్రీ పద్దులకు ఉపయోగిస్తారు. ఈ మాత్రం దానికి ఇతరులను విసిగించనేల? ఆనక సిగ్గుపడనేల?

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
ఈ పేజ్	...	7
సీరియల్	...	8
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ప్రజలే పాఠ్య గ్రంథాలు

సినిమా ... 10

మనవాళ్లకు పొరుగింటి పుల్లకూరే రుచా?

రుచి ... 20

రాజ్మా రుచులు





గబ్బిలం స్ఫూర్తి అభినందనీయం

విశ్వనరుడుగా జీవనం కొనసాగించడం భారత భూమికపై చాలా కష్టం. అది జాషువాకే చెల్లింది. ఆయన రచనల్లో విశిష్టమైనది గబ్బిలం. అది భారతీయ సమాజానికి జీవన గ్రంథం. నిచ్చెన మెట్ల సమాజంలో కులవివక్ష, అస్పృశ్యత, అంటరానితనం కొనసాగుతున్నాయి. 1960-70 దశాబ్దం పాటు జాషువా కవిత్వం రాష్ట్ర వ్యాపితంగా సంచలనం కలిగించింది. అందుకే దళిత కవితా ఉద్యమానికి మార్గదర్శకుడయ్యారు. జాషువా కవిత్వాన్ని 'స్ఫూర్తి'లో పరిచయం చేసినందుకు మిత్రుడు కత్తి పద్మారావుకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ముందు తరాలకు స్ఫూర్తి

కొందరిపైన రాజకీయ ప్రభావం అధికంగా వుంటుంది. మరికొందరిపై సాహిత్య ప్రభావం వుంటుంది. కొద్దిమందిని మాత్రమే సైన్సు ప్రభావితం చేస్తుంది. టి.రమేష్‌గారి స్ఫూర్తి వ్యాసం చదివినప్పుడు ఎస్.వెంకట్రావుగారు రాసిన నిర్జీవం-జీవపరిణామం పుస్తకం గుర్తొచ్చింది. రమేష్‌గారు నాకు సైన్సు పుస్తకాలు చదివించే స్ఫూర్తినిచ్చారు. 'తారతమ్యాలు' కథ చదివాక నేను ఎంతగానో బాధపడ్డాను. మానవత్వం లేని మనిషి తారసపడితే ఇలాగే వుంటుంది. యజమాని-నౌకరు మధ్య ఇమిడి వున్న వర్గ స్వభావాన్ని రచయిత చక్కగా రాశారనిపించింది. సుబోధ్ బిస్వాస్ పట్టు విడవకుండా ప్రయత్నించి చదువుతుంటే నాకు నా చదువు గుర్తొచ్చింది. చదువుకు ప్రాధాన్యతనిచ్చే వామపక్షాల పాలనలోని బెంగాల్‌లో వున్నందువల్ల ఎందరో మహానుభావులు ఇచ్చిన సహకారం వల్లను సుబోధ్ వృద్ధిలోకి తప్పక రాగలడు. ఇతని జీవితం ముందు తరాలకు స్ఫూర్తినిస్తుంది కూడా. 'చిగురులు వేసిన కలలన్నీ ...' కథలో ఆడమనిషికి మగ మనిషి తోడు, మగ మనిషికి ఆడ మనిషి తోడు అవసరమని చూపించారు. ఇదిగాక కనిపించని ప్రధానమైన విషయం చెప్పారు. అది సంతానం. సంతానం సమాజాభివృద్ధికి కావాలి. మూడు పాత్రలను హుందాగా నడిపి కథను చక్కగా చదివించారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

చీమబడిలో చేరాల్సిందే

పదవుల కోసం యుద్ధాలు చేసేవారు ప్రజలను పాలిస్తారా? ఛీ ఛీ! క్షీరాన్నము, పొంగలి, స్వీట్ రైస్, చక్కెర పొంగలి అద్భుత రుచులు. జాషువా 'గబ్బిలం' చాలు గర్వపడేదానికి. భారీ గుమ్మడికాయ నిజంగానే వండర్. అద్భుత గాయకుడు ఘంటసాల ముందు (వెనుక) అవధానమా! చీమబడిలో చేరితేనే మంచిది. అగ్గిపుల్లల ఓడ చేసే బదులు నేరుగా పెద్ద ఓడనే చేయవచ్చు. కార్టూన్లు, కథలు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

మంచికథ చదివిన తృప్తి కలిగింది

అట్టమీది కథ క్రీడాభిమానులను అలరించేలా వుంది. బాలనేస్తాలులో చేసేద్దాం అంశం బావుంది. అగ్గిపుల్ల ఓడలు భలే బావున్నాయి. కవిత్వంలో ఆశారాజు, డా॥దేవరాజు మహారాజు కవితలు ఉన్నత భావాలతో ఆకట్టుకున్నాయి. తెల్సా విశేషాలు చదువుతుంటే ఔరా అనిపించింది. రెంటాల జూనియర్ సినిమా టికెట్ రేట్లపై అందించిన వాస్తవాలు నగ్న సత్యాలు. ధైర్యంగా అక్షరబద్ధం చేయడం మంచి విషయం. ఈ పేజీ విశేషాలు ఉపయోగకరంగా వున్నాయి. చీమ వెనుక ఇంత కథ వుందా? ఇన్ని విశేషాలున్నాయా అని అచ్చెరువు చెందాం. కొత్త పుస్తకాలు ద్వారా ఆయా పుస్తక విషయ సరంజామా విశ్లేషణాత్మక సమీక్షతో సమాచారం మాకందుతోంది. 'బాకీ' ఒక మంచి కథను చదివామన్న తృప్తి కలిగించింది. మనలోమాట పదవీ ప్రహసనం వాస్తవాన్ని, చేదునిజాన్ని, నగ్న సత్యాన్ని ఏకరువు పెట్టినట్లైంది. సామాన్య ప్రజల మనిషిని పదవిలో కూర్చోబెట్టే రోజెప్పుడో?

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

రేట్ల వ్యాసం రైట్

రెంటాల జూనియర్ వ్యాసం బావుంది. సినిమా టికెట్ రేట్లు పెరగడం వలన సామాన్య ప్రజలు బాధపడుతున్నారని నాకనిపించింది. బుకింగ్‌లో తక్కువ అమ్మి బ్లాక్‌లో ఎక్కువ టికెట్లు అమ్ముతున్నారు. అందుకు థియేటర్ మేనేజర్ నుంచి గేటు కీపర్ దాకా తమ వంతు కృషి చేస్తున్నారు. రోబోకు 50 రోజుల దాకా సగం బుకింగ్‌లో, సగం బ్లాక్‌లో అమ్మారు. ఆరెంజ్ 10 రూపాయల టికెట్‌ను 100 రూపాయలకు అమ్మారు. సెన్సార్ బోర్డువారు, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పైరసీ సీడీలు చూస్తున్నారు. టికెట్ మొదటి రోజు పోలీసుల కాపలా పెట్టిమరీ టికెట్లు ఇప్పిస్తారు. అప్పుడు కూడా ఇదే పరిస్థితి.

పి.కెంకటరెడ్డి, విజయవాడ.



ఉత్కంఠభరితం ట్రాయ్ సీరియల్

వాన్‌ట్రాయ్ సీరియల్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. ప్రతివారం ఆ తర్వాత ఏమవుతుందోనన్న కుతూహలం కలుగుతోంది. మంచి నవలను సీరియల్‌గా అందిస్తున్నందుకు మీకు మా పాఠకులందరి తరపున ధన్యవాదాలు. సినిమా టికెట్ల రేట్లపై రెంటాల రాసిన వ్యాసం బావుంది. రుచి వంటకాలు ప్రయత్నిస్తున్నాం. ఇవేకాక సంప్రదాయ వంటకాలను కూడా పరిచయం చేయొచ్చుకదా. పిల్లల కథలు, బాలల పేజీ ఆకట్టుకొనేలా వుంటున్నాయి. పిల్లలకోసం మరో రెండు పేజీలు రంగుల్లో ఇస్తే నయం.

సునంద, మురారి, వినుకొండ.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

మిడత తెలివి

మనుషులే కాదు ప్రకృతిలో ప్రతి జీవికీ తనను తాను రక్షించుకొనే విధానాలు, ఉపాయాలు వున్నాయి. మిడత చూడండి. ఎంత చిన్న ప్రాణి? పైగా ఎవరికీ అపాయం కూడా చేయదు. ఆకులమీద పడి బతుకుతుంటుంది. ఏదైనా తొండగానీ తన మీదకి వస్తుంటే ఏం చేస్తుందో తెల్సా! నోటి నుంచి గాలి బుడగలను ఒదులుతుంది. వాటి వల్ల తొండకు వికారం, తలనొప్పి కలుగుతుంది. అలాంటి రసాయనాలు ఆ గాలి బుడగల్లో వుంటాయి. ఈ బుడగలు బద్దలయ్యాక విడుదలయ్యే రసాయనాలే మిడతలకు లక్ష్మణరేఖల్లా కాపలా కాస్తాయి. ఒకవేళ ఈ ప్రయత్నం విఫలమైందనుకోండి. ఒక చుక్క వాంతి చేసుకొంటుంది. ఇదే తన ఆఖరి అస్త్రం. ఈ వాంతి నుంచి భయంకరమైన దుర్గంధం వస్తుంది. దానివల్ల శత్రువు మిడత జోలికి వస్తే ఒట్టు.



తొలి పెంపుడు పిల్లి



పిల్లులను, కుక్కలను పెంచుకుంటుంటాం కదా. మరి తొలిసారిగా పిల్లులను పెంచుకోవాలన్న ఆలోచన ఎవరికి వచ్చింది.... అంటే ఈజిప్టువాసులకే అని తెలుస్తోంది. ఎలాగంటారా? సైప్రస్‌లోని నవీన శిలాయుగానికి చెందిన ఓ గ్రామంలో పురావస్తు పరిశోధకులు చేసిన తవ్వకాలు... చెప్తున్నాయి. ఓ మనిషి ప్రాచీన అవశేషాల పక్కనే చెక్కుచెదరని పిల్లి కంకాళం కూడా కనిపించింది. చనిపోయిన ఓ మనిషి మృత దేహం పక్కనే పిల్లి కళేబరాన్ని కూడా అప్పట్లో ఖననం చేసినట్టు ఆధారాలు చెబుతున్నాయి. ఈ అవశేషాలు తొమ్మిదివేల 500 సంవత్సరాల ప్రాచీనమైనవని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. అంటే ఈజిప్షియన్లు పిల్లిని విగ్రహంగా మలుచుకోవడానికి 5 వేల సంవత్సరాలకు ముందే సైప్రస్‌లో పిల్లిని పెంచుకొనేవారని పరిశోధకులు చెబుతున్నారు.

తెల్సా!

బుల్లి చేప

మీరు ఎప్పుడైనా 0.33 అంగుళాల చేపను చూశారా! లేదుకదూ. ఇదిగో మీ కళ్ల ముందు కనిపిస్తోందదే. ఇది ప్రపంచంలోకెల్లా చిన్న చేపగా గుర్తింపు పొందింది. అయితే దీన్ని శాస్త్రవేత్తలు పాతిక సంవత్సరాలు ఆలస్యంగా కనుగొన్నారు. వీటికి నోటిలో పళ్లుగానీ, శరీరం మీద పొలుసులుగానీ కనీసం రంగు కూడా వుండదు. అంతేకాదు. ఇవి చాలా తేలికగా వుంటాయి. అంటే దాదాపు అరకిలో బరువుకే ఐదులక్షల దాకా చేపలు తూగుతాయి. ఇంతకీ దీని పేరేంటో తెల్సా! స్టౌట్ ఇన్‌ఫాంట్ ఫిష్. వీటిలో అతి పెద్ద ఆడ చేపలు అంగుళంలో మూడోవంతు వుండగా, మగచేపలు మాత్రం అంగుళంలో నాలుగో వంతు వుంటాయి. వీటి శీరంలాగే జీవితకాలం కూడా తక్కువే. ఇవి రెండు నెలలు మాత్రమే బతుకుతాయి. అసలు 1979లోనే ఆస్ట్రేలియా తీరంలోని గ్రేట్ బారియర్ రీఫ్ ప్రాంతంలో ఈ చేపలు కనిపించినప్పటికీ దాదాపు రెండు దశాబ్దాల వరకు వాటి గురించి పట్టించుకోలేదు. ఆ తర్వాత ఇది వెన్నెముకగల ప్రాణుల్లో అతి చిన్న ప్రాణి అని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. అయితే మనకు ఒక అనుమానం వస్తుంది. ఇంత చిన్న చేప సముద్రంలో ఎలా బతుకుతోంది? అని. ఆ విషయాన్నే కనిపెట్టాల్సి వుంది.



నారికేళం సముద్రయానం

కొబ్బరికాయలు మనం అప్పుడప్పుడు కొడుతుంటాం. అవి ఒక్కోసారి కుళ్లిపోతుంటాయి. కానీ సముద్రంలో పడిన కొబ్బరికాయ మాత్రం సంవత్సరం వరకు జీవశక్తిని కలిగి వుంటుంది. సముద్ర తీరాల్లో సహజంగా పెరిగే కొబ్బరిచెట్ల కాయలు సముద్రాల్లో పడుతుంటాయి. కెరటాలు ఊరుకుంటాయా! వాటిని తమతోపాటు తీసుకెళ్తాయి. అలా సముద్రంలో అలలతో కలిసి ఐదు వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తాయి. ఆ తర్వాతే ఏ తీరానికో చేరి మొలకెత్తుతాయి. కొన్ని కొబ్బరికాయలు ఏడాది దాటేకే సముద్రంలోనే కుళ్లిపోతాయి. సముద్రంలో కొబ్బరికాయ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పీతలకు చిక్కితే అంతే సంగతులు. శుభ్రంగా కొబ్బరి పీచును తీసి లోపలి కొబ్బరిని ఆరగించేస్తాయి. ఇది కొంత వరకు నయం. ఒక్కోసారి సముద్రాల్లో తుపాన్లు వస్తాయి. అప్పుడు చూడాలి! అలలతోపాటు ఇవి రాళ్లను, కొండలను ఢీకొనాల్సి వస్తుంది. ఇన్ని కష్టాలనుంచి బయటపడి తీరం మీద పడిన వెంటనే కొబ్బరికాయ నుంచి మొలక బయటికి వస్తుంది.

స్ఫూర్తి

డా॥ కె.హేమలత,
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు.

ప్రజలే పాఠ్యగ్రంథాలు

ఇప్పటి పరిస్థితులను, ఇప్పటి బీదరికాన్ని, ఇప్పటి పెట్టుబడిదారీ అమానుష నైజాన్ని చెప్తున్నట్టే వున్న ఈ వాక్యాలను బెతూన్ ఆనాడే చెప్పాడు. రోగలక్షణాల ఆధారంగా కేవలం రోగానికి చికిత్స చేయడానికే పరిమితం కాకుండా, రోగం మూలకారణాలను శరీరంలో, పరిసరాలలోనే కాక మొత్తం సమాజంలో పరిశీలించి, సమాజాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ బెతూన్. తాను ఏ ఆశయాన్నయితే నమ్మాడో, అదే ఆశయం కోసం పోరాడుతున్న వారికి - వారు ప్రపంచంలోని ఏ మూలనున్నా స్పెయిన్ కానీండి, చైనా కానీండి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రత్యక్షంగా వారితో మమేకమై వైద్య సేవలందించిన మహా మనీషి డా॥ బెతూన్.'రక్తాశ్రువులు' చదువుతుంటే బెతూన్ కలలుగన్న సమాజం కావాలని ఎవరికి మాత్రం అనిపించదు.

ఆ స్ఫూర్తి ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం నిండా కనిపిస్తుంది.

నేను మెడికల్ ప్రాక్టీస్ చేసే కాలంలో మా డాక్టర్ సర్కిల్‌లో తరచూ ఒక జోక్ వినిపిస్తూ ఉండేది. ఒక డాక్టరుగారు తాను ఫలానా గ్రామంలో ఒక మహిళకు ఇటీవలే ఆపరేషన్ చేసి గర్భసంచీ తీసేశానని ఇంకొక డాక్టరుతో అంటాడు. దానికి ఆ డాక్టర్ అదెలా సంభవం? ఆ గ్రామంలోని మహిళలందరికీ గర్భ సంచీకి సంబంధించిన జబ్బులు చేసి, ఆపరేషన్ అవసరం అయి, ఆ డాక్టర్లు ఆపరేషన్ చేశారని కాదు. అవసరం ఉన్నా లేకపోయినా, డబ్బు సంపాదనే లక్ష్యంగా ఆపరేషన్లు చేసే ధోరణిని ఎద్దేవా చేసేందుకు పై జోక్ చెప్పేవారు. ఈ కాలంలో ఈ ధోరణి మరింతగా వ్యాపించింది. నిదానంగా రోగి చెప్పేది విని, ప్రశ్నల ద్వారా అవసరమైన సమాచారం సేకరించి, తగిన పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేయడం, అవసరమైనంత వరకే మందులనుగాని, ఇతర చికిత్సా పద్ధతులనుగానీ ఉపయోగించడం అనేది అరుదైపోయింది. దాని బదులు రోగి నోరు విప్పీ విప్పక ముందే రకరకాల ఇన్వెస్టిగేషన్స్‌తో ఒక చిట్టా రాసి ఇవ్వడం, 'గోటితో పోయేదానికి గొడ్డలి వాడే' వైఖరి పెరిగాయి. ప్రపంచీకరణ, ఉదారవాద విధానాలు ప్రారంభమై, ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించడం పెరిగాక, ఈ వైఖరి మరింతగా ప్రబలింది. ఫలితంగా పేదలు వైద్యానికి దూరమవుతున్నారు. మధ్యతరగతి ప్రజలు ప్రైవేటు వైద్యం చేయించుకుని పేదలుగా మారిపోతున్నారు. అప్పుల్లో కూరుకుపోతున్నారు.

పెట్టుబడిదారీ విధానంలో అన్నిటితో పాటు వైద్యం కూడా ఎలా ఒక సరుకుగా మారిపోతుందో నేడు ప్రత్యక్షంగా మనం చూస్తున్నాం. ఆ సరుకుతో వ్యాపారం చేయడం కోసం లక్షలు పోసి మెడికల్ కాలేజీలలో సీట్లు కొనుక్కుంటున్నారు. వ్యాపారం మరింత లాభసాటిగా ఉండాలని మరిన్ని లక్షలు ఖర్చు చేసి స్పెషలైజేషన్లు, సూపర్ స్పెషలైజేషన్లు చేస్తునారు. అంత ఖర్చు చేసినప్పుడు అంతకు మరింత సంపాదించాలనుకోవడం సహజం. ఫలితంగా ధనవంతులకు అత్యంత ఆధునిక వైద్య పరిజ్ఞానం, సౌకర్యాలు అందుబాటులో ఉండగా, అతి సామాన్యమైన, అతి సులభంగా నివారించగల అతిసార, క్షయ, మలేరియా వంటి జబ్బులతో లక్షలాది పేదలు ఏటా మృత్యువాత పడుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో వైద్యవృత్తి లక్ష్యం ఏమిటి, ఒక వైద్యుడి సామాజిక బాధ్యత ఏమిటి అనే విషయాలను కనువిప్పు కలిగేలా చాటి చెప్పే పుస్తకమే 'రక్తాశ్రువులు'. డాక్టర్ నార్మన్ బెతూన్ జీవిత చరిత్ర.

స్పెయిన్, చైనా ప్రజల విమోచనా పోరాటాలను తనవిగా భావించి ఆ లక్ష్య సాధన కోసం చేసిన నిస్వార్థ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన గొప్ప మనీషి బెతూన్. రోగులకోసం ఏసీ గదుల్లో ఎదురుచూస్తూ కూర్చునే డాక్టర్ కాదు బెతూన్. తూటాలను కూడా లెక్క చేయక యుద్ధ రంగంలో రోగుల దగ్గరకే వెళ్లి సేవలు చేసిన సాహసి. డబ్బు పెట్టి వైద్యం కొనుక్కునే శక్తి లేనివాళ్లకే తన అవసరం ఎక్కువ వుందని బోసి ఆఫీసు గదిలో కూర్చున్నప్పుడు గ్రహించిన తాత్వికుడు. 'డాక్టర్స్! గాయపడ్డ వాళ్ల దగ్గరకు మీరే వెళ్లండి. గాయపడ్డ వాళ్లు మీ దగ్గరకు వచ్చేదాకా ఆగకండి" అని తోటి వైద్యులకు తెలియచెప్పిన మానవతామూర్తి. గెరిల్లా వైద్య చికిత్సా విభాగాన్ని ఏర్పాటుచేసి వేలాది ఉత్తమ సాహసోపేత యోధుల ప్రాణదాత. ఈ పుస్తకం ద్వారా ఆయన జీవితంలో ప్రతి సంఘటనను ప్రత్యక్షంగా చూసిన భావన కలుగుతుంది. డా॥బెతూన్‌కు ఎదురైన ఎన్నో సంఘటనల నుంచి ఎన్నెన్నో పాఠాలను నేర్చుకోవచ్చు.

డాక్టర్ బెతూన్ సాదాసీదాగా వుండేవాడు. జనంతో ఇట్టే మమేకమయ్యేవాడు. తన అవసరం వున్న చోటికి పరుగుపరుగున వెళ్లి పనిచేసేవాడు. నమ్మినదానికి కట్టుబడి పనిచేసేవాడు. ఓసారి రక్తదానం గురించి తెలీక ప్రజలు భయపడుతుంటే...బెతూన్ చేసిన ప్రయోగం ఎన్నటికీ మర్చిపోలేం. చైనాలోని ఓ గ్రామంలో ప్రజలందరి ముందు తనే రక్తదానం చేసి ఒక రోగిని కాపాడతాడు. అదంతా ప్రత్యక్షంగా చూచిన జనం రక్తదానం చేయడానికి ముందుకొస్తారు. అప్పుడు బెతూన్ తన డైరీలో రాసుకున్న వాక్యాలు ఎంత విజ్ఞానదాయకంగా వుంటాయో చూడండి."మనకు తెలీని దాన్ని గురించి మనం భయపడ్తాం. వాళ్లు, నేను, మిగతా మానవకోటి...అన్నిటికంటే ముఖ్యంగా, అవగాహన, పరిజ్ఞానం భయాన్ని పోగొడ్తాయ్. నా రక్తాన్ని నేనెలా బైటికి తీసి రోగి శరీరంలోకి ఎక్కించానో, తర్వాత రోగి క్రమేణా ఎలా కోలుకొన్నాడో వాళ్లు ప్రత్యక్షంగా చూశారు. నాకు ఏ అపాయమూ కలగకపోవడం కూడా వాళ్లు గమనించారు. ఏదో మార్మికమైనది, అజ్ఞాతమైనది, భీతికొలిపేది అందులో లేదని అప్పుడు వాళ్లకు అర్థమైంది. వాళ్లు సిగ్గుపడ్డారు....".

ఆసుపత్రి ప్రాంగణంలోనే గుళ్లూ, గోపురాలూ కట్టి అనుకోని దుష్పరిణామం ఏదైనా ఎదురైతే, రోగి అజ్ఞానాన్ని ఆధారం చేసుకుని నెపం దేవుడిపైకి నెట్టే ప్రయత్నం చేసే డాక్టర్లకూ, పుట్టబోయే బిడ్డ జాతకం బాగుండాలని వారం, వర్జ్యం, నక్షత్రం లెక్కలు వేసి ముహూర్తం చూసి సిజేరియన్ చేయించుకోవడాన్ని ప్రోత్సహించే డాక్టర్లకూ, డాక్టర్ బెతూన్‌కూ ఎంత తేడా! అంతేకాదు. తన జబ్బు గురించిన వివరాలు తెలియక, అమాయకత్వంతో అజ్ఞానంతో, ఇంజెక్షన్లు చేస్తేనే, సెలైన్ ఎక్కిస్తేనే, ఖరీదైన మందులు వాడితేనే తన జబ్బు నయమవుతుందనే రోగి నమ్మకాన్ని ఆసరా చేసుకుని తాము డబ్బు సంపాదించాలనే వైఖరి అంతకంతకూ పెరిగిపోతున్నది. డాక్టర్ బెతూన్‌లా ఓపికతో ప్రజల మూఢనమ్మకాలనూ, అజ్ఞానాన్నీ దూరం చేసి, వారు శాస్త్రీయంగా ఆలోచించేలా చేయగల డాక్టర్లు ఈ రోజు ఎంతైనా అవసరం.

ప్రజల మధ్య గడుపుతూ వారి నుంచి విలువైన విషయాలు నేర్చుకోవడానికి మక్కువ చూపేవాడు బెతూన్. అందుకు కృతజ్ఞత కూడా వెలిబుచ్చేవాడు. "నేను మీ వద్ద నుంచీ చాలా విలువైన పాఠాలు నేర్చుకున్నాను. నిస్వార్థంగా పాటుబడే చైతన్యం, కలిసికట్టుగా సహకార భావంతో పనిచేయడం, ఎంత పెద్ద ఇబ్బందులనైనా అధిగమించడం మీ వద్దనుంచీ నేను నేర్చుకున్న పాఠాలు" అనేవాడు.

ప్రజల నుండి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలే గానీ, ఎన్నో విలువైన పాఠాలను వారి అనుభవాల నుండీ నేర్చుకోవచ్చు. స్వాతంత్ర్య పోరాటం కానీండి, తెలంగాణా పోరాటం కానీండి, లేదా ఈనాడు వివిధ రంగాలకు చెందిన ప్రజలు, కార్మికులు, శ్రామిక మహిళలు చేస్తున్న పోరాటాలు కానీండి, సామాన్య ప్రజలు తమ దైనందిక జీవితంలో ఎన్నో రకాల ఇబ్బందుల నెదుర్కొంటూ, ఆ ఇబ్బందులను అధిగమించడానికి ఏ రకంగా పోరాడుతున్నారో గమనిస్తే, ఎవరికైనా స్ఫూర్తి కలగక మానదు. ముఖ్యంగా అతిపేద కుటుంబాలకు చెందిన మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు కానీ ఆశాలు కానీ, ఇతర రంగాలకు చెందినవారు కానీ, కుటుంబంలో, అధికారులనుండీ, రాజకీయంగానూ ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనప్పటికీ పోరాటాలలో పాల్గొంటున్న తీరు నిజంగా స్ఫూర్తిదాయకం. సామాజికంగా వెనకబడ్డ రాష్ట్రాలుగా భావిస్తున్న హిందీ రాష్ట్రాలలో కూడా సామాజిక కట్టుబాట్లను, కుటుంబ పరిమితులను అధిగమించి అనేక మంది మహిళలు కార్మిక పోరాటాలలో పాల్గొంటున్నారు. చిన్న చిన్న ఆటంకాలెదురైతేనే నిరాశా నిస్పృహలకు గురైన సందర్భాలలో నమ్మినదాని కోసం పట్టుదలతో వారు చేస్తున్న పోరాటం ఉత్తేజాన్నివ్వక మానదు.

డబ్బే పరమావధి...డబ్బు చేతిలో పడితేగాని వైద్యం అందని పరిస్థితి ఇప్పుడే కాదు ఆరోజుల్లోనూ వుంది. ఓరోజు రాత్రి నగరం యావత్తూ నిద్రిస్తున్న సమయంలో బెతూన్ ఇంటి తలుపు మోగుతుంది. తీరా వెళ్లి చూస్తే ఓ వ్యక్తి చీకట్లో నిలబడి వుంటాడు. బెతూన్‌ను చూసీచూడగానే గలగలా చెప్పుకుపోతాడు. విషయం ఏమంటే.. అతని భార్య ప్రసవవేదన పడుతోంది. కానుపు చేయడానికి డాక్టరు దొరకలేదనేది సారాంశం. ఆ కానుపు చేయడానికి వైద్యులు ఎందుకు దొరకలేదో బెతూన్‌కు వెంటనే బోధపడుతుంది. వెళ్లి ఒక పెట్టె బండిలో ఇద్దరు పిల్లలతో కాపురం వుంటున్న అతని భార్యకు కానుపు చేస్తాడు. చేతులు కడుక్కొని బయటకు వచ్చిన బెతూన్‌కు ఆ వ్యక్తి భయంభయంగా ఒక డాలరు నోటు ఇవ్వబోతాడు. అయితే బెతూన్ అది తీసుకొని తిరిగి అతని జేబులోనే దోపుతాడు. అంతేకాదు తెల్లవారేక ఒక బుట్టెడు తినుబండారాలు, పుట్టిన బిడ్డకు బట్టలు, తల్లికి రాత్రిపూట వేసుకొనే గౌను పట్టుకొని ఇస్తాడు. పైగా సరైన పోషణ లేని తల్లికి ఆహారం తయారుచేసి ఇస్తాడు. బిడ్డని పరీక్ష చేసి వచ్చేస్తాడు. ఆయనకు తెలుసు అంత చేసినా ఆ బిడ్డ నెల రోజులు కూడా బతకదని. అదే ఆ వ్యక్తికి వారానికి ఇరవై డాలర్లు వచ్చే ఉద్యోగమే వుండివుంటే అతనికెంతో మేలు జరిగి వుండేదని, చావబోయే బిడ్డకు చేసేదానికంటే మించిన మేలు అతనికి కలిగివుండేదని అప్పుడు తన భార్యతో చెప్పి బాధపడతాడు బెతూన్. పైగా ఆర్థిక, వ్యాధి లక్షణ శాస్త్రాల సన్నిహిత సంబంధాన్ని ఆయన తన వ్యాసంలో చాలా స్పష్టంగా చెప్తాడు "ధనవంతుడి క్షయ, దరిద్రుని క్షయ అని వున్నాయ్. ధనవంతుడు కోలుకుంటాడు. దరిద్రుడు మరణిస్తాడు. మనిషిలో క్షయ రోగ క్రిముల్ని సాకే పరిస్థితులు వ్యాప్తి చెందుతున్నాయి. అటువంటి పరిసరాల్లోనే మనిషిని కొనసాగనివ్వు. అతను చచ్చి తీర్తాడు".

అదేవ్యక్తికి వారానికి ఇరవై డాలర్లు వచ్చే ఉద్యోగమే ఉండి ఉంటే.. ? పేదరికానికి మూల కారణాలను గురించి, దాని పరిష్కారం గురించి ఆలోచించే డాక్టర్లు, ఈ రోజు ఎందరున్నారు? ఆరోగ్యంగా ఉండడానికి పోషకాహారం, సమతుల్యాహారం, పరిశుభ్రమైన పరిసరాలు మొదలగునవి అత్యంత కీలకమైనవని డాక్టర్లందరికీ తెలుసు. కానీ ఎంతమంది పేదలకవి ఎందుకు అందుబాటులో లేకుండా పోతున్నాయో ఆలోచించగలుగుతున్నారు? తగిన ఉపాధి లేక, పగలూ రాత్రీ పని చేసినా తగిన వేతనాలు లేక కోట్లాది మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో, మురికి కూపాలలో జీవిస్తున్నారు. పస్తులతో, అర్ధాకలితో కాలక్షేపం చేస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. వారికి తగిన ఉపాధి కల్పించగలిగితే, సరియైన వేతనాలు అందేలా చేయగలిగితే, వారికి పరిశుభ్రమైన పరిసరాలు కడుపునిండా తిండి సమకూర్చగలిగితే మూడొంతులకుపైగా జబ్బులు వారి దరి జేరనేజేరవు. రోగులకు వైద్యం చేయడంలో తలమునకలవుతూ, మూల కారణాలను వెతికే తీరిక వైద్యులను, అసలు కారణాలు సమాజంలో వెతకాలని తట్టిలేపుతుందీ వాక్యం.

ఒక చర్చా గోష్టిలో బెతూన్ పెట్టుబడిదారీ విధానంలో వైద్యవృత్తి ఏ విధంగా దిగజారుతుందో వివరిస్తూ తీవ్ర విమర్శ చేస్తాడు. "చిక్కిన మేరకు చేజిక్కించుకో" అనే సూత్రం మీద నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థలో వైద్యం ప్రైవేటు లాభార్జన ప్రాతిపదికన గుత్త పరిశ్రమలాగా నడుస్తోంది. మిగతా పెట్టుబడిదారి ప్రపంచం ఏ సంక్షోభానికి గురైందో ఆ గతే వైద్య వృత్తికి పట్టడం అనివార్యం. దేశంలోని జనాభాకు మించి ఆహారోత్పత్తి జరుగుతున్న ఈ దేశంలో వేలాది ప్రజలు ఆకలితో మలమలమాడి పోతున్నట్లే, మిల్లు యజమానులు తాము అమ్మగలిగిన దానికంటే అనేక రెట్లు వస్త్రోత్పత్తి, చేస్తున్నా వేలాది ప్రజలు చాలీచాలని గుడ్డల్లో ముడుచుకు పోతున్నట్లే... వైద్య సదుపాయాలున్నా వాటికి డబ్బు పెట్టలేక లక్షల మంది జనం రోగం, బాధతో మూలుగుతున్నారు. వేల వేలమంది అకాల మరణం పొందుతున్నారు... ఆరోగ్య రక్షణ కల్పించడానికి అత్యుత్తమ మార్గం అనారోగ్యాన్ని సృష్టించే ఆర్థిక వ్యవస్థను మార్చడం. ప్రతి వ్యక్తి తన వైద్య సౌకర్యాలను తానే కొనుక్కునే ఈ పద్ధతి నడవదు. ఈ పద్ధతి అన్యాయం, అసమర్థం, నిరర్థకం. దీనికి కాలదోషం పట్టింది. ఈ పద్ధతి ఎప్పుడో వంద సంవత్సరాల కిందటే 19 వ శతాబ్ద ప్రారంభ కాలంలోనే పారిశ్రామిక విప్లవాగమనం నాడు చచ్చిపోయి వుండాల్సింది! ఈ ఆధునిక పారిశ్రామిక సమాజంలో ప్రైవేటు ఆరోగ్యం అంటూ వుండదు. ఆరోగ్యం అంతా సార్వత్రికం....కాబట్టి ప్రజల ఆరోగ్యాన్ని, సంరక్షించడం అనేది ప్రభుత్వం యొక్క ప్రాథమిక విధిగా, తన పౌరుల పట్ల పాటించవలసిన ధర్మంగా గుర్తించవలసి వుంది".

ఇప్పటి పరిస్థితులను, ఇప్పటి బీదరికాన్ని, ఇప్పటి పెట్టుబడిదారీ అమానుష నైజాన్ని చెప్తున్నట్టే వున్న ఈ వాక్యాలను బెతూన్ ఆనాడే చెప్పాడు. రోగలక్షణాల ఆధారంగా కేవలం రోగానికి చికిత్స చేయడానికే పరిమితం కాకుండా, రోగం మూలకారణాలను శరీరంలో, పరిసరాలలోనే కాక మొత్తం సమాజంలో పరిశీలించి, సమాజాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ బెతూన్. తాను ఏ ఆశయాన్నయితే నమ్మాడో, అదే ఆశయం కోసం పోరాడుతున్న వారికి - వారు ప్రపంచంలోని ఏ మూలనున్నా స్పెయిన్ కానీండి, చైనా కానీండి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రత్యక్షంగా వారితో మమేకమై వైద్య సేవలందించిన మహా మనీషి డా॥ బెతూన్. 'రక్తాశ్రువులు' చదువుతుంటే బెతూన్ కలలుగన్న సమాజం కావాలని ఎవరికి మాత్రం అనిపించదు. ఆ స్ఫూర్తి ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం నిండా కనిపిస్తుంది. ★



బాల్యం నెమరేస్తున్నాను

నాటి బాలలే నేటి పౌరులు
బతుకు ఉద్ధంథంలో
బాల్యం నెమరేస్తున్నాను
కులాలు లేవు మతాలు లేవు
బాల్యానికి రాగద్వేషాలు లేవు
గెలుపు ఓటముల గణితంలో
ఒకానొక బిళ్లంగోడు
పాశుపతాస్త్రమై ఛేదించినప్పుడు
తాగే ఒక్క కుండ బద్దలైంది
పొలిమేరకు పోండినాయన్లారా
పెంకులు ఏరుతూ ఆ తల్లి అన్నప్పుడు
పగిలిన కుండ తగిలిన బిళ్లంగోడు
కులాలు తవ్వుకోలేదు కుటిలం ఎత్తుకోలేదు
మేఘాలు ఆకాశం అంచుల నివాసాల్లో
ఆదమరచి నిద్రిస్తున్నప్పుడు
వినువీధిలో గాలిపటాలు
విహంగాలై విహరిస్తున్నప్పుడు
వాయుదేవుని ఆగ్రహానికి గురై
అన్ని దారాలు ఒక్కటైనప్పుడు
తెగిన తెగని గాలిపటాల మధ్య
ద్వేషాలు రోషాలు పెల్లుబకలేదు
నడివీధుల్లో గోలీలు
రాజసం వుట్టిపడుతూ దొర్లుతుంటే
ఊరి నడకలు మెప్పగా
తప్పకు తిరుగుతుండేవి
ఒకడి అభ్యాసం నైపుణ్యం
ఆటలను కొల్లగొడితే
ఒకడి సాధనలేని చేతులు
నిస్సహాయంగా నిలిచేవి
ఓడిన చేయి విజేతను
ఒక్క గోలీ యివ్వమని అర్థించినప్పుడు
అభ్యర్థన తిరస్కృతి ఐనప్పుడు
ఉక్రోషాలు వైషమ్యాలు తలెత్తలేదు!
నేటి పౌరులే నాటి బాలలు
భాషలు వేరు వేషాలు వేరు
చూపులు వేరు నడతలు వేరు
మతానికోమార్గం కులానికో తోవ
ద్వేషానికోదారి రోషానికోబాట
కులం సమస్యల సృష్టికర్త
కులం సమస్యల పరిష్కర్త!

-అడిగోపుల వెంకటరత్నమ్

కవిత్వమ్

అమ్మ

ప్రపంచమంతా శూన్యంలా వుందని
వైరాగ్యంలో వున్న బైరాగిలా మాట్లాడను
నువు లేని జీవితం లేదని!
నీ చల్లని చూపులోంచి వచ్చిన వెచ్చదనం
గుర్తొచ్చినప్పుడు
నా కోసం తపనపడిన నీ ఆరాటం తెలిసినప్పుడు
నీ ఆలోచనాలోచనాలతో నన్ను ప్రేమతో తడిమినప్పుడు
అవే...ఆ ..ఆత్మీయ సంగతులు నా మనసులోకి
నా గుండెల్లో గూడు కట్టుకుని అనునిత్యం నృత్తిస్తున్నప్పుడు
అప్పుడు అందరాని లోకాల్లోంచి నువు మాట్లాడినట్లనిపించిందిప్పుడు
నువ్వులేని ప్రపంచమంతా శూన్యంలా తోస్తుంది...కానీ...
రుచిగా వంటలు కుదిరి కడుపారా తిన్నప్పుడు
ఆకలి తెలిసి ఆరా తీసిన నీ మాటలు నా కర్ణపుటాలను
తాకినట్లనిపిస్తుంది
ఆందోళనలను ఆర్తిగా కనిపెట్టి చూపుతోనే ధైర్యాన్నిచ్చిన చల్లని తల్లివి
కడుపారా కన్న నీకు తప్ప
కన్న పిల్లల కష్టాలు ఎవరికి తెలుస్తాయి?
చేసే పని కష్టమైనా నిష్టగ చేయమనీ
చేయలేని పని ఇష్టం లేకున్నా వదిలేయమనీ
గెలుపులోనే సంతృప్తుందనీ
ఓటమికి జడిసి అసంతృప్తిపాలవ్వద్దనీ
నీవిచ్చిన సలహాలను మరువగలనా?
ఈ నిరంతర పోరాటాల జీవితంలో!

అసత్యమాడొద్దని, అన్యాయం చేయొద్దనీ
సందర్భోచితంగా సూక్తులు ఉదహరించిన నీవు
నాకిప్పుడు మహాయోగిలా అనిపిస్తున్నావు!
మంచి చేయకున్నా చెడు మాత్రం చేయకు
మరో జన్మకోసం చూడక ఈ జన్మను
వృథా చేయకని
ఎందుకు చెప్పావో నీవు చనిపోయాక తెలిసింది
నీ పార్థివ శరీరానికి నివాళులివ్వాలని వచ్చిన
పెద్దల పొగడ్తలు విన్నాక స్థిరపడింది
నీవు మహోన్నత శిఖరం వంటిదానివని
మానవత్వానికి సజీవ సాక్ష్యానివని
శాంతం, దయ, చిరునవ్వు, ఆప్యాయత సొంతమైన నీవు
మహాసాధువనీ తెలిసిందిప్పుడు
లేనినాడు లేనట్టు, వున్ననాడు వున్నట్టు బతికిన నీకు
లేకున్నా వున్నట్టు బతుకుతున్న మాకు 'అంతరం'
ఒక 'జీవితం'
అమ్మతోనే ఒక 'తరం' పోయినట్లన్న
లోకోక్తిలోని 'నిజం' ఎంత నిజం!!
మనుషులంతా ప్రేమతో పిలుచుకునే 'అమ్మ'
నాకు ఇక లేనప్పుడు
నిజంగా ప్రపంచమంతా నిండైన శూన్యమే!!

-కొండపల్లి నిహారిణి



రేటింగ్ చెప్పే అలెక్సా...

ఈ స్పీడ్ యుగంలో ప్రతిదానికీ రేటింగ్ అనేది సర్వసాధారణమైపోయింది. వెబ్‌సైట్లకు సైతం రేటింగ్ సర్వసాధారణం. ప్రస్తుతం ఇంటర్‌నెట్‌లో లక్షలకొద్దీ వెబ్‌సైట్లున్నాయి. నిత్యం కొత్తవి పుట్టుకొస్తూనే వున్నాయి. అలాంటప్పుడు సైట్ల ర్యాంకింగ్ తెలుసుకోవడం అంటే కష్టమైన పనే. ఆ రేటింగ్‌ను బట్టే ఆయా సైట్లకిచ్చే యాడ్స్ రేటు కూడా ఆధారపడి వుంటుంది. ఈ రేటింగ్‌ను కొలవడానికి అనేక సైట్లు అందుబాటులో వున్నాయి. వాటిలో పేరెన్నికగన్నది 'అలెక్సా.కామ్'. ఎప్పటికప్పుడు సైట్ ర్యాంకు చూసుకోవడానికి ఒక టూల్‌బార్‌ను కూడా రూపొందించింది. ఈ టూల్‌బార్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే బ్రౌజర్ టాస్క్‌బార్‌లో ఓపెన్ అయివున్న సైట్ ర్యాంక్ గ్రాఫ్‌తో సహా చూపుతుంది.

ఇంటర్నెట్లో లక్షలాది వెబ్‌సైట్లూ, వాటిలో కోట్లకొలది వెబ్‌పేజీలూ ఉన్నాయనే విషయం తెలిసిందే. కానీ ఆ వెబ్‌సైట్లన్నిటికీ 1,2,3...అని ర్యాంక్‌లిచ్చి ఓ వరుస క్రమంలో పెడితే?.... ఆలోచన అయితే బాగానే వుంది. ఆచరణలో అది సాధ్యమా? ఇంటర్నెట్ నిరంతరం మారుతూనే వుంది. ఈ రోజు మంచి ర్యాంకులో వున్న వెబ్‌సైట్ రేపు వెనకబడవచ్చు. ఈ రోజు వెనుకబడ్డ సైట్ రేపు మంచి ర్యాంకులో వుండొచ్చు. అటువంటప్పుడు ర్యాంక్‌లు ఇవ్వడం ఎలా సాధ్యం?... అందుకే ఆయా వెబ్‌సైట్లకి లభించే ఆదరణనుబట్టి ఎప్పటికప్పుడు ర్యాంక్‌లివ్వడం సమంజసంగా వుంటుంది. చాలా కాలంగా ఆ పనిని సమర్ధంగా నిర్వహిస్తున్నది 'అలెక్సా' వెబ్ ఇన్ఫర్మేషన్ కంపెనీ. ఇంటర్‌నెట్‌లోని వెబ్‌సైట్ల సమాచార వినియోగాన్ని రోజూ గుర్తించడమే దీనిపని. ఎక్కువమంది పాఠకులు ఏ వెబ్‌సైట్‌కి ఉన్నారో, ఏ వెబ్‌సైట్‌లోని పేజీలు ఎక్కువ ఆదరణ పొందుతున్నాయో గమనిస్తూ, ఆయా విశేషాల ఆధారంగా వెబ్‌సైట్లకి ర్యాంకుల్ని నిర్ణయిస్తుంది అలెక్సా. టెక్స్, గ్రాఫ్‌ల రూపంలో ఈ ర్యాంకుల వివరాలు వెబ్‌సైట్ (www.alexa.com)లో అందరికీ లభ్యమవుతాయి.

ర్యాంక్‌లు ఎలా ఇస్తారు?

అలెక్సా ఏప్రిల్ 1996లో మొదలైంది. ఈ సంస్థ వెబ్‌సైట్‌కి ర్యాంక్‌లిచ్చే ప్రక్రియలో రోజూ ఇంటర్‌నెట్‌లోని 1.6 టెరాబైట్ల సమాచారాన్ని తిరగేస్తుంది. కోటీ అరవైలక్షల సైట్ల నుంచి 450 కోట్ల వెబ్‌పేజీల్ని అధ్యయనంచేసి వాటి ఆదరణనిబట్టి ఆర్డర్లో పెడుతుంది. ఇందుకోసం కొన్ని పవర్‌ఫుల్ ప్రోగ్రాముల్ని రూపొందించుకుంది అలెక్సా.

అలెక్సాలో 'వెబ్ ర్యాంకింగ్' రెండు విషయాల ఆధారంగా రూపొందిస్తారు. ఒకటి- "ఒక వెబ్‌సైట్‌ని ఎంత ఎక్కువమంది చూస్తారు?" అనేది. దీన్ని 'రీచ్ (reach)' అని పిలుస్తారు. అంటే వెబ్‌సైట్ ఎంతమందికి రీచ్ అవుతోంది - అనేది ఇక్కడ పాయింట్. ఇక రెండోది- మొత్తం వెబ్‌సైట్ పరంగా కాకుండా వెబ్‌పెజీలపరంగా ఏ సైట్లో ఎన్ని పేజీలను పాఠకులు చూస్తున్నారు? అనేది. దీన్నే పేజ్ వ్యూస్ (Page Views) అని సూచిస్తోంది అలెక్సా. వెబ్‌సైట్ రీచ్ గుర్తించినప్పుడు మళ్లీ పేజ్ వ్యూస్ ఎందుకనే అనుమానం రావచ్చు. ఉదా: - ఒక వెబ్‌సైట్ హోమ్ పెజీని మూడు లింకుల్లో పేజీల్ని మాత్రమే ఐదు వేలమంది నిత్యం చూస్తున్నారనుకోండి. మరో వెబ్‌సైట్‌లో మూడువేలమంది హోమ్ పేజీతో బాటు ఇరవై పేజీల్ని కూడా నిత్యం చూస్తున్నారనుకోండి. కేవలం సైట్ 'రీచ్' మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే మొదటి సైట్ మంచి ర్యాంక్ పొందుతోంది. లోపలి పేజీలకు ఎంతో ఆదరణ ఉన్నా రెండోసైట్ వెనకబడిపోతుంది. కేవలం (5000×3=) 15000 హిట్స్ కలిగిన మొదటి సైట్, (3000×20=) 60,000 హిట్స్ కలిగిన రెండో సైట్ కంటే మంచి ర్యాంక్ పొందుతుంది. అందుకే హోమ్‌పేజీని మాత్రమే కాకుండా, మొత్తం ఎన్ని పేజీలు చూశారనేదాన్ని కూడా లెక్కలోకి తీసుకుని వెబ్‌సైట్ ర్యాంక్‌ని నిర్ణయిస్తారు.

సైట్ రేటింగ్‌లో రీచ్, పేజ్ వ్యూస్...అనేవి ముఖ్యమైనవి. ఏదేని సైట్ యొక్క ర్యాంకింగ్ వివరాలు దీనిలో కనిపిస్తాయి. ప్రముఖ వెబ్‌సైట్ 'గూగుల్ ఇండియా' (http://www.google.co.in)ను తీసుకుంటే డిసెంబర్ 12న దీని రీచ్ 4.49000గా ఉంది. అంటే ఒక్క రోజునే ఇంటర్నెట్ చూసే వారిలో 4.49000 మంది గూగుల్ ఇండియా సైట్ చూస్తున్నారన్న మాట. దీన్ని బట్టి ఇంటర్‌నెట్‌లో ఇక సైట్ స్థాయి ఏమిటి అనేది మనకి అర్థమవుతుంది. ప్రస్తుతం దీని ర్యాంక్ పరంగా చూస్తే డిసెంబర్ 12నాటికి 14గా వుంది.

ఇక పేజ్ వ్యూస్ విషయం చూద్దాం. పేజ్ వ్యూస్ విషయంలో అలెక్సా గతానికి, ఇప్పటికీ కొంచెం పద్ధతి మార్చుకుంది. గతంలో పేజ్ వ్యూస్ లెక్క ఎలా ఉండేదంటే - ఇంటర్‌నెట్‌లో జనం చూసే మొత్తం వెబ్‌పేజీల్లో (వెబ్‌సైట్లలో కాదు, పేజీలపరంగా చూడాలి.) ఫలానా సైట్ తాలూకు పేజీలు ఎంత శాతం? అని లెక్కగట్టే వారు. ఉదాహరణకి ఒక సైట్ పేజ్‌వ్యూస్ శాతం 0.008 ఉందనుకోండి. దాని అర్థం - ఇంటర్‌నెట్లో చూసే ప్రతి లక్ష పేజీల్లోనూ ఆ సైట్‌కి సంబంధించిన వాటా 8 పేజీలన్న మాట! అయితే ఇప్పుడు అలెక్సా పేజ్‌వ్యూస్‌ని ఈ విధంగా లెక్కపెట్టడం లేదు. యూజర్లు ఆ రోజు చూసిన మొత్తం పేజీల సంఖ్యను, ఆ యూజర్ల సంఖ్యతో భాగించి ఒక్కో యూజర్ సగటున ఇన్ని పేజీలు చూసారనేది లెక్క గడుతోంది.

రీచ్, పేజ్‌వ్యూస్ - అనే రెండు విషయాల ఆధారంగా వెబ్‌సైట్ ర్యాంక్‌ని నిర్ణయిస్తుంది అలెక్సా. ఒక వెబ్‌సైట్ చూసేటప్పుడు ఏదో చూశామని కాకుండా ఇంటర్‌నెట్‌లో దాని ర్యాంకింగ్ ఎంత? రోజుకి, వారానికి, నెలకి ఎంత మంది చూస్తున్నారనేది స్పష్టంగా తెలుసుకోవడానికి అలెక్సా సహాయకారిగా వుంటుంది.

అలెక్సా ర్యాంకింగ్ ప్రకారం ఇండియాలో టాప్-10 సైట్స్ :

1. గూగుల్ ఇండియా (www.google.co.in)
2. గూగుల్ (www.google.com)
3. ఫేస్‌బుక్ (www.facebook.com)
4. యాహూ!(www..yahoo.com)
5. యూట్యూబ్ (www.youtube.com)
6. బ్లాగర్స్.కామ్ (www.blogspot.com)
7. వికీపీడియా (www.wikipedia.org)
8. ఆర్కుట్ (www.orkut.co.in)
9. రెడిఫ్ ఇండియా లిమిటెడ్ (www. rediff.com)
10. ట్విట్టర్ (www.twitter.com)

- కె.ఎక్స్.రాజు

సీరియల్

జరిగినకథ:

ట్రాయ్‌కు ఉరిశిక్ష పడిందని తెలిశాక అతణ్ణి జైల్లో కలుస్తుంది కుయేన్. అతను ఆమెతో ప్రేమగా మాట్లాడతాడు. తను ఆలస్యంగా రావడానికి గల కారణాలను, తను చెప్పిన అబద్ధాలను గురించి కూడా చెప్తాడు. తనకు అబద్ధం చెప్పడమంటే అసహ్యమనీ... అయినా తను చేసే పనిని రహస్యంగా కాపాడాల్సిన బాధ్యత తనపైన వుందికనుకే అలా చేశాననీ చెప్తాడు. ధైర్యంగా వుండమంటూ... పేదలకోసం పనిచేయమని బోధిస్తాడు. తర్వాత అతన్ని మరలా 30వ తేదీన చూడ్డానికి అవకాశం ఇస్తారు. అయితే అప్పుడు కుదరదు. ఆ తర్వాత 20 రోజులకు అనుమతి లభిస్తుంది. అప్పుడు ట్రాయ్ గురించిన భయంకరమైన అసత్యాన్ని కుయేన్‌కు చెప్తారు. ఆ తర్వాత.

వియత్నాం వీరుడు ఎన్గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్
అనువాదం: పాటూరి రామయ్య

(పన్నెండో భాగం)

అనుమతి పత్రం కోసం సెప్టెంబరు 18వ తేదీ వరకు ఎదురు చూశాను. అనుమతి లభించింది. చిహోవా జైలుకు వెళ్ళాను. ఇన్‌ఛార్జి అధికారి అన్నాడు :

'నీ భర్త కాథలిక్కు మతాన్ని స్వీకరించాడు. ఈ విషయం మతగురువు కూడా ధృవీకరించాడు.'

నేను పరుగెత్తుకుంటూ గేటు వెలుపలికి వెళ్ళాను. భోజనం, ప్రత్యేకించి పండ్లు కొనుక్కొని పట్టుకెళ్ళాను. ట్రాయ్ పొగ తాగడు. టీ అలవాటు కూడా లేదు. ఆయనకు పండ్లు అమితమైన ఇష్టం. పండ్లు వగైరా పొట్లాల సంచి భుజంకేసి తగిలించుకున్నాను. శిక్షితుల వార్డులో చూడ్డానికి వచ్చే వాళ్ళకు ప్రత్యేకించిన గదిలోకి ఆతృతగా వెళ్ళా.

నా భర్తను కలుసుకున్నాను. ఇలా అన్నాను :

మీరు నా కోసం కళ్ళ కాయలు కాసేట్టు చూస్తున్నారు కదండీ !

నా తలనీలాలు రేగి నుదుట, చెక్కిళ్ళపైనా చమటతో అంటుకుపోయాయి. వాటిని తన వేళ్ళతో తడుముతూ ఇలా అన్నాడు.

'అవును. చాలా దీర్ఘకాలం. ఎందుకిలా ఎగరొప్పుతున్నావ్?'

అతి కష్టం మీద ఊపిరి లోపలికి పీల్చుకుంటూ అన్నాను.

'నిన్ను ఇప్పుడు చూడ్డానికి అనుమతి లభిస్తుందని నేను అనుకోలేదు. అందువల్ల బట్టలూ, సంచీ తీసుకురాలేకపోయాను. ఈరోజుకు మాత్రమే నాకు పాస్ ఇచ్చారు. కాని సాధారణంగా ఈ పాస్ రేపు, ఎల్లుండి కూడా ఉపయోగపడుతుంది. నీకోసం భోజనం కొని తెచ్చాను. మనం ఇలా చాలా కాలం నుంచి కలుసుకోలేకపోయినందున నా మనసు భీతి చెందింది.

నేను తీసుకెళ్ళిన పొట్లాల వైపు చూస్తూ ఆయనిలా అన్నాడు :

'నువ్వు చాలా ఖర్చుపెడుతున్నావు. నా కివన్నీ అవసరం లేదు. మన పెళ్ళి బాకీలు తీర్చేందుకు డబ్బులు దాచిపెడితే మంచిది.'

'బాకీలు గురించి మీరేమీ భయపడకండి. వాటిని నేను తీర్చివేయగలను. మీరు కాథలిక్కు మతం పుచ్చుకున్నారట నిజమేనా?'

'ఇందుకోసం మతగురువు వచ్చి నీతో మాట్లాడినట్టు ఒకతను నాతో చెప్పారు'

'ఎవరు చెప్పారు?' అంటున్న ఆయన ముఖం ఆశ్చర్యంతో వణికిపోయింది.

'జైలు ఆఫీసులో ఒకతను చెప్పాడు'

'శుద్ధ అబద్ధం. మతగురువు నాదగ్గరకొచ్చింది నిజమే. నన్ను కాథలిక్కుగా మార్చడానికి అన్ని విధాల ప్రయత్నించిందీ నిజమే కానీ, అందుకు నేను పూర్తిగా వ్యతిరేకించాను. వాళ్ళు ఏమి చెబితే అది నమ్మకు. మన స్నేహితులకూ, నాకూ మధ్య గండికొట్టేందుకు విచిత్రమైన అబద్ధాలు సృష్టిస్తారు. సృష్టించడమే కాదు. బాగా ప్రచారం గూడా చేస్తారు'

నేను ఆయన కాలు వత్తుతూ ఇలా అడిగాను :

'బ్యాండేజీ ఎప్పుడు తీసేశారు?'

'15వ తేదీన. అమ్మ, నాన్న ఎలా వున్నారు?'

'బావున్నారు. చెల్లి లేదూ. క్యాన్. అది వస్తానని మారాం పెడుతోంది మళ్ళీ నిన్ను చూడాలని. నేను ఇదివరకు 'డాన్'ను తీసుకొస్తుండేదాన్ని. పోలీసులు జాగ్రత్తగా కనిపెడుతుండేవాళ్ళు. అందువల్ల డాన్‌ను నావెంట తీసుకొచ్చి వారి కుటుంబానికి కష్టాలు కలిగించదలచుకోలేదు.'

నన్నిలా అడిగాడు :

'ఇదివరకు నన్ను చూసిం తర్వాత క్యాన్ ఏం చెప్పింది.'

'టూ సోదరుణ్ని చూశాను. టూ నన్ను చూసి నవ్వాడు. రెండు పొడుగాటి కర్రలూనూ ఆయన ...అని చెప్పుకుంటోంది..'

"ఆ పిల్లంటే నాకు చాలా ఇది. నన్ను పిలుస్తూ చేతులు ఊపింది. దాన్ని నాలుగు పరుగులు తీయించి కౌగిట్లోకి తీసుకొనేవాణ్ణి. ఈ నెలాఖరులోగా నువ్వు మళ్ళీ నన్నొకసారి

చూడవచ్చు. అప్పుడు క్యాన్‌ను కూడా వెంట తీసుకురా. నువ్వెళ్ళేటప్పుడు బొమ్మలూ అవి కొనుక్కొని వెళ్ళు. అవి ట్రాయ్ మామయ్య ఇచ్చాడని 'డాన్'కు ఇవ్వు. నా మాదిరే. వాడు అమ్మ అబ్బా లేనివాడు. తల్లిదండ్రుల ప్రేమాదరణకు నోచుకోలేదు మేము. నేను లేని లోటు లేకుండా వాణ్ని చూస్తుండు'

నేను చిన్నగా చెవిలో అన్నాను.

'గత పర్యాయం నేను వచ్చి వెళ్ళిన తర్వాత నువ్వు ఏమి చెబుతుండేవాడవు? ఆ దుర్మార్గులు ఏం చెప్పారో తెలుసా. నీవు ఉద్రేకపూరితమైన ప్రచారం గావిస్తున్నావట! అందువల్ల నాకు పాస్ ఇవ్వ నిరాకరించారు.'

'ఇక్కడ నా మిత్రులను సంతోష పెట్టేందుకు మంచివార్త చెప్పాను. అమెరికన్లు ఉత్తర వియత్నాం మీద విమానదాడులు చేసి బాంబులు వేశారని, కాని ఏమీ ధ్వంసం చేయలేకపోయారనీ, పైగా అమెరికా యుద్ధ విమానాలను ప్రజలు కూల్చి వేశారనీ చెప్పాను. ఈ విషయం వినడంతో కామ్రేడ్సంతా అంతులేని ఆనందంలో మునిగిపోయారు. శిక్షితుల వార్డు అంతా సందడితో నిండిపోయింది.

"ఆగస్టు 30వ తేదీన నేను రాలేకపోయినందుకు నిరుత్సాహ పడ్డావుకదూ? పొట్లాలు, పండ్లు నీకు చేర్చేందుకు శ్రీమతి యం చాలా సహాయపడింది. ఆ రోజంతా నీకు విశ్రాంతి వుండి వుండదు'

ట్రాయ్ చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు.

'మధ్యాహ్నం వరకు చూశాను. వార్డరు నన్ను ప్రేక్షకుల గదిలోకి పిలుస్తాడని ఎంతో ఆశతో ఎదురు చూశాను. నా గుండె దడ దడ కొట్టుకొంది. నిన్ను చూడాలని తహతహలాడాను. నీ ఫోటో దాచిపెట్టాను. కాని పోలీసులు సోదా చేసి తీసుకున్నారు. చించివేశారు దుర్మార్గులు. సాయంత్రం వరకు నువ్వు కనపడలేదు. మనసు దహించుకుపోయింది. జబ్బుపడి ఉంటావనో లేక అరెస్టు అయి ఉంటావనో అనుకున్నాను'

మరణ శిక్షితుల వార్డు నుండి ఒక స్త్రీ ఖైదీ కిందికి దిగి వచ్చింది. ఆమెను చూడ్డానికి వచ్చిన తన తల్లితో కలిసి మేము కూర్చొనివున్న బెంచి చివర కూర్చొన్నది. ఆ తల్లి ఏడుస్తోంది. మాటలు ఒత్తి ఒత్తి పలుకుతోంది.

క్వాంగ్‌నామ్‌లో ట్రాయ్‌కి బంధువులున్నారు. వాళ్ళు ఆయన్ను చూడ్డానికి చేసిన ప్రయత్నాలను గూర్చి చెప్పారు.

'వాళ్ళు ఇంకా ఇక్కడే ఉన్నారా?' అడిగాడు.

'లేదు. వెళ్ళి పోయారు.'

'నేను క్షేమంగా ఉన్నానని వాళ్ళకు ఒక ఉత్తరం ముక్క రాసెయ్యి. మరి బే సోదరుడు విడుదలయ్యాడా?' అన్నాడు.

'అవును'.

ట్రాయ్ జాలిగా ఇలా అన్నాడు :

'అతనికి నా అభినందనలు అందజెయ్యి. అతణ్ణి వృధాగా అరెస్టు చేశారు. అద్దెకు తీసుకున్న మా కార్యాలయంలోనే అతడూ ఉన్నాడు. అందువల్ల అతణ్ణి కూడా అరెస్టు చేశారు. ఏం బాధ పడవద్దని చెప్పు. ఇల్లు అమ్మవద్దనీ, అక్కడ నుంచి మరోచోటకు లేచి వెళ్ళవద్దనీ చెప్పు. అతడు ఇల్లు అమ్ముకుంటే నువ్వు ఎక్కడ వుంటావు?'

ఒక పోలీసువాడు వచ్చి నా చేతికి ఒక కాగితం ఇచ్చాడు. అది ఫోటో. దాన్ని చూచి తీసుకొని ఇలా అన్నాడు ట్రాయ్.

'ఈ ఫోటో ఎప్పుడు తీయించావు'

ఈ మధ్యనే. ఖైదీలను చూడవచ్చే వాళ్ళ వెంట వాళ్ళ ఫోటోలు కూడా ఉండాలట అందుకని'

'ఫోటోలో సన్నగా పాలిపోయి వున్నావు!'

'ఫోటో చూచి కుమిలిపోయాడు ట్రాయ్. నాలోకి ఆమని చూస్తూ.

సైగాన్‌లో సైతం గడిచిన మాసాల కంటే పరిస్థితి తీవ్రంగా పరిణమించింది. బైటకు వెళ్ళగలిగితే నీ కళ్ళకు కట్టినట్లు కనబడగలదు. పసిపిల్లలు సైతం యన్‌గుయెన్ ఖాన్‌ను పేరుపెట్టి ఖండిస్తున్నారు.

కీలుబొమ్మ మురాని ఎవళ్ళూ లెక్కచేయడం లేదు. వాడి ఇంటిని ముట్టడించారు. విద్యార్థులు, యువకులు, వెలుపలికి వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పుకోవాలని వాడిని ఒత్తిడి పెట్టారు.

'చాలా పాలిపోయావు. ఎందుకలా అయ్యావు?'

'లేదు. నేను బాగానే ఉన్నాను.'

'మన పక్కింటి వాళ్ళ స్నానాల గది ఇప్పటికీ నిన్ను వాడుకోనిస్తున్నారా?'

'ఎప్పుడూ నా మీద వాళ్ళు ఆదరాభిమానాలతో ఉంటారు'

నాకిలా జ్ఞప్తికి తెచ్చాడు :

'అక్కడ నేల చదరంగా ఉండదు. ఎక్కువగా బరువు మోయెద్దు. కొద్ది కొద్దిగా ఒక్కొక్కసారికి అర డబ్బాడు నీళ్ళు తీసుకెళ్ళుండు. జారి కిందపడితే ఎవరు చూస్తారు నిన్ను?'

'ఇలాంటి స్వల్ప విషయాల గురించి మీ మనసు పాడు చేసుకోకండి. నేనిప్పుడు మునుపటిలా కాదు. చాలా దృఢంగా ఉన్నాను. నిర్భయంగా అలా రాత్రిళ్ళు కూడా తిరిగి రాగలను.'

ఆయన మరో విషయంలోకి మళ్ళాడు.

'పట్టణంలో పరిస్థితి ఎలా ఉంది?'

ప్రదర్శనలు మాత్రం అంతగా జరగడం లేదుగాని పోరాటం మాత్రం జరుగుతోంది. పోరాటం జరుగుతున్నప్పుడు తుపాకి కాల్పుల మోతలు వినడానికి రాత్రంతా కునుకు తీయకుండా ఎదురు చూస్తుంటాను. మళ్ళీ తెల్లవారేటప్పటికి పరిస్థితి మామూలుకు వచ్చేది. నేను చాలా నిరాశ చెందాను.

పట్టణం వెలుపల మాత్రం పోరాటం తీవ్రంగా జరుగుతూనే ఉంది. మన ఇంటి సమీపంలోనే లారీ, టాక్సీ డ్రైవర్లు వుంటున్నారు. వాళ్ళు అప్పుడప్పుడూ విమోచన దళాలను కలుసుకొంటుంటారు. ఇలా జరిగినప్పుడల్లా వాళ్ళు సమావేశాలు జరుపుతుంటారు. తరచు రాత్రిళ్ళప్పుడు తుపాకి కాల్పులు వినబడుతున్నవి. మీకు వినబడటం లేదా?'

ఏకాగ్ర చిత్తుడై తలూపుతూనే అన్నాడు.

'మన జిల్లా మొత్తంగా విముక్తి చేయబడిందనే క్వాంగ్ నామ్‌లోని మన ప్రజలు చెపుతున్నారు. ఆ జిల్లా ప్రాంతమంతటా విమోచనా దళాలున్నాయి. ఫ్రెంచి వాళ్ళతో ప్రతిఘటనా యుద్ధం చేసినప్పటికంటే ఇప్పుడు మన దళాలు అధునాతన ఆయుధాలు కలిగి ఉన్నాయి. సైగాన్‌లో సైతం గడిచిన మాసాల కంటే పరిస్థితి తీవ్రంగా పరిణమించింది. బైటకు వెళ్ళగలిగితే నీ కళ్ళకు కట్టినట్లు కనబడగలదు. పసిపిల్లలు సైతం యన్‌గుయెన్ ఖాన్‌ను పేరుపెట్టి ఖండిస్తున్నారు.

కీలుబొమ్మ మురాని ఎవళ్ళూ లెక్కచేయడం లేదు. వాడి ఇంటిని ముట్టడించారు. విద్యార్థులు, యువకులు, వెలుపలికి వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పుకోవాలని వాడిని ఒత్తిడి పెట్టారు. ఈ విధంగా పరిస్థితులు మారిపోతున్నాయి.

'అందువల్ల ఇంతకు ముందెన్నడూ లేనంతగా అతి కఠినంగా దారుణమైన పరిస్థితులు సంభవించనున్నాయి.'

ఆయన చేతిని పట్టుకున్నాను. చాలా సన్నగా చిక్కిపోయి ఉన్నాడు. చేతిమీద నల్లటి నరాలు ఇంతకు ముందు ఆసుపత్రిలో చూచినప్పటికంటే స్పష్టంగా పైకి ఉబికిలేవు.

చిన్నగా నవ్వుతూ ఇలా అన్నాడు :

'మన పెళ్ళినాటి ఉంగరం అమ్మేశాను. ప్రేలుడు మందుగని నాటడంలో నిమగ్నుమై ఉన్నాను. ఉద్యమ నిర్మాణంతో సంబంధాలు పెట్టుకోవడానికి నాకు వ్యవధి లేదు. ఆ సమయానికి అవసరమైన డబ్బు నా వద్ద లేదు. అప్పటో ఉన్నదల్లా ఈ ఉంగరం.'

నాలోకి చూస్తూ ఇంకా అన్నాడు :

'నా ప్రాణం సైతం త్యాగం చేయడానికి నిర్ణయించుకున్నప్పుడు వెధవది ఈ ఉంగరం అమ్మడానికి ఎందుకు వెనకాడాలి? నువ్వు అడిగినప్పుడు నా హృదయం కలత చెందింది. అబద్ధంతో ఆ విషయం మాఫీ చేశాను. నా పనిలో లీనమైపోయినప్పుడు కూడా వేలిన మెరుస్తూ ఉండేది. ఈ విషయం నీకు కోపం కలిగించదూ?'

(మిగతాభాగం వచ్చేవారం)

సినిమా కబుర్లు

ఇప్పుడు తెలుగు సినీ సీమకు పర్యాయపదం ఏమిటో తెలుసా? సంక్షోభ సీమ! ఇటీవల వరుసగా ఒకదాని తరువాత మరొకటిగా ఎదురవుతున్న సమస్యలనూ, సంక్షోభాలనూ గమనిస్తే ఆ మాటతో ఏకీభవించని వారు అరుదు. పైరసీ, సినిమా టికెట్ రేట్లు, పెరిగిన బడ్జెట్లు, పెరిగిపోతున్న ఫ్లాప్‌లు - ఇలా ఒకదాని మీద మరొకటిగా సమస్యలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ఆ జాబితాకు తాజా చేరిక - తెలుగు చిత్ర పరిశ్రమలో షూటింగులు ఆగిపోయేందుకు కారణమైన సంక్షోభం.

మనవాళ్ళకు పొరుగింటి పుల్లకూరే రుచా?

ఛాయాగ్రాహకుడు సంతోష్ శ్రీనివాస్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ కథానాయకుడిగా, బెల్లంకొండ సురేష్ నిర్మిస్తున్న 'కందిరీగ' చిత్రం షూటింగులో హైదరాబాద్‌లో డిసెంబర్ 8వ తేదీన జరిగిన సంఘటనలు తాజా పరిణామాలకు దారితీశాయి. స్థానిక ఫైటర్ల అసోసియేషన్‌కు చెందిన కొందరు సెట్‌లోకి వెళ్ళి, చిత్ర బృందంపై దాడి చేసి, షూటింగులకు అంతరాయం కలిగించినట్లు కథనం. దానికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి కలసి అన్ని చిత్రాల షూటింగులనూ ఆపివేసి, డిసెంబర్ 9న బంద్ పాటించాలని నిర్ణయించాయి. ఆ విధంగానే చేశాయి.

అసలు జరిగిందేమిటి?

అయితే, ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. నిర్మాతల మండలికీ, ఏ.పి. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కూ మధ్య ఇది మరింత అగ్గి రాజేసింది. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాల్సిన రెండు వర్గాలూ దేనికది బెట్టు చేయడంతో వ్యవహారం శ్రుతి మించి రాగాన పడింది. "చర్చల ద్వారానే ఏ సమస్యలైనా పరిష్కారమవుతాయి. అందరం కలసి కూర్చొని మాట్లాడుకుంటే, దేనికైనా పరిష్కారం లభిస్తుంది" అని నిర్మాతల మండలిలో కార్యనిర్వాహక వర్గ సభ్యుడైన ప్రముఖ నిర్మాత డి. సురేష్‌బాబు అన్నారు. అయితే, అలా కలసి కూర్చొని మాట్లాడడానికి చేసిన ప్రయత్నాల్లో నిజాయతీ లోపించినట్లు కనిపించింది.

గొడవ జరిగిన మరునాడు షూటింగులను బంద్ చేయడమే కాక, నిర్మాతల మండలి, ఫిల్మ్ చాంబర్‌లు కలసి ఈ సమస్యపై చర్చించాయి. ఫైటర్ల పక్షాన ఏ.పి. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. కానీ ఫెడరేషన్ ప్రతినిధులెవరూ ఈ చర్చలకు రాలేదు. "చాలా రోజులుగా మాకు చాలా సమస్యలున్నాయి. వాటినన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇస్తేనే చర్చలకు వస్తా"మని ఫెడరేషన్ తన జవాబును ముక్కుసూటిగా తేల్చేసింది. ఫలితం ప్రతికూలంగా ఉండడంతో తలబొప్పి కట్టిన నిర్మాతల మండలి షూటింగుల బంద్‌ను నిరంతరాయంగా కొనసాగించింది. రోజురోజుకూ విభిన్న వర్గాల మధ్య పట్టింపులు పెరిగేసరికి, తెలుగు చిత్ర పరిశ్రమ పూర్తిగా స్తంభించిపోయే పరిస్థితి తలెత్తింది.

ఆనాటి ఒప్పందం ఏమిటి?

అసలు ఆంధ్రప్రదేశ్ ఫైటర్లకూ, తమిళనాడు ఫైటర్లకూ మధ్య పోరాటం ఎందుకు మొదలైందన్నది ఆసక్తికరమైన అంశం. ఆ సంగతి తెలియాలంటే కనీసం దశాబ్దిన్నర కాలం వెనక్కి వెళ్ళాల్సి ఉంటుంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తరలి వస్తున్న సందర్భం నాటి సమస్య ఇది. అప్పట్లో చిత్ర నిర్మాణానికి కావాల్సిన సహాయకుల దగ్గర నుంచి సాంకేతిక నిపుణుల దాకా చాలా మందిని మద్రాసు నుంచి ఇక్కడికి తెచ్చుకునేవాళ్ళు. ముఖ్యంగా నృత్య, పోరాట విభాగాల్లో ఇలా మద్రాసు నుంచి వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉండేది. స్థానికంగా తగినంత నైపుణ్యం ఉన్నవాళ్ళు లేక ప్రయాణ భత్యాలు, బస ఖర్చులు, బేటాలు వగైరాలన్నీ భరించి మరీ వారిని తెచ్చేవారు.

కాలక్రమంలో హైదరాబాద్‌లో నిపుణుల సంఖ్య పెరిగినప్పటికీ, ఇదే పద్ధతి కొనసాగుతూ వచ్చింది. సహజంగానే స్థానిక కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ఆ పరిస్థితుల్లో స్థానిక కార్మికులు వీధికెక్కడంతో, తరువాత ఓ రాజీ ఫార్ములా కుదిరింది. ఏ తెలుగు చిత్ర షూటింగులోనైనా సరే మద్రాసు నుంచి నృత్య, పోరాట శాఖలకు చెందిన కార్మికులను పిలిపించాల్సి వస్తే, గరిష్ఠంగా 50 శాతం మందినే వాడాలనీ, అవసరమైన మిగిలిన 50 శాతం మంది కార్మికులకు హైదరాబాద్‌కు చెందిన వారికి అవకాశం ఇవ్వాలనీ ఓ లిఖిత పూర్వక ఒప్పందం కుదిరింది.

కొన్నిసార్లు ఈ ఒప్పందం అమలైనా, పెద్ద హీరోల భారీ చిత్రాల విషయంలో మాత్రం పదే పదే ఉల్లంఘనకు గురవుతూ వస్తోంది. స్థానికులను కాదని పరాయివారికి పెద్ద పీట వేయడం పెరుగుతూ వస్తోంది. "కొన్ని సందర్భాల్లో స్థానిక కార్మికులను 50 శాతం మందిని పిలిపించి, వారికి పని మాత్రం ఇవ్వకుండా డబ్బులిచ్చి పంపేయడం జరుగుతోంది. మొత్తం పని అంతా పరాయి రాష్ట్ర కార్మికులతోనే పూర్తి చేసేస్తున్నారు. అంటే, సాంకేతికంగా మాత్రం ఒప్పందాన్ని అమలు చేస్తూ, అసలు పని విషయంలో మాత్రం స్థానికులకు ప్రతిభ లేదన్నట్లు వదిలేస్తున్నారు. ఇది ఎంతో అవమానకరం కాదా!" అని



'ఆరెంజ్' స్టిల్

హైదరాబాద్‌కు చెందిన స్థానిక ఫైటర్ ఒకరు అన్నారు.

స్థానిక కార్మికులలో లోలోపల పెరిగిన ఈ అసంతృప్తి ఫలితమే - 'కందిరీగ' చిత్ర షూటింగ్‌లో హైదరాబాద్, మద్రాసు ఫైటర్ల మధ్య జరిగిన ఘర్షణ. 'కందిరీగ' చిత్రానికి ఫైట్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్న 'స్టన్' శివ ఇలా స్థానికులను కాదని మద్రాసు నుంచి తనవాళ్ళను రప్పించడం ఇప్పటికి చాలా సినిమాల షూటింగుల్లో జరిగినట్లు విమర్శలున్నాయి. ఆయన చిత్ర షూటింగుల్లోనే గతంలో ఇలా మూడు, నాలుగు సార్లు గొడవలు జరిగాయని కూడా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

పరాయి రాష్ట్రాల మీదే ప్రేమ

వర్తమాన ఘర్షణకు కారణమైన అంశాన్ని ఒక్కసారి లోతుగా గమనిస్తే పాముల పుట్టల లాంటి వ్యవహారాలు చాలానే కనిపిస్తాయి. స్థానిక ప్రతిభావంతులకు మొండి చేయి చూపించి, ఎక్కడెక్కడ నుంచో వేరేవాళ్ళను తెచ్చి అందలమెక్కించడం మన వినోద పరిశ్రమలో చాలా కాలంగా కొనసాగుతున్న వ్యవహారమే. అది ఎంత వరకు పాకిందంటే - చివరకు కొన్ని ఉపగ్రహ తెలుగు టీవీ ఛానళ్ళలో ప్రసారమయ్యే ప్రతిభాన్వేషణ కార్యక్రమాలైన డ్యాన్స్ షోలలో సైతం న్యాయనిర్ణేతలుగా పరాయి రాష్ట్రాల వారే! పరాయిభాషకు చెందిన చిత్ర దర్శకులంటే మన నిర్మాతలకూ, హీరోలకూ ఉన్న మోజు సరే సరి! "ఇక్కడ ఒక తెలుగు దర్శకుడు పెద్ద ఫ్లాప్ తీస్తే, అతనికి మళ్ళీ సినిమా దొరకడం కష్టం. అదే పరాయి రాష్ట్రాల నుంచి వచ్చిన లారెన్స్, ధరణి, 'బొమ్మరిల్లు' భాస్కర్ లాంటి వాళ్ళు 'డాన్', 'బంగారం', 'ఆరెంజ్' లాంటి ఫ్లాపులిచ్చినా సరే, మనవాళ్ళే వాళ్ళ వెంటపడుతూ, మళ్ళీ మళ్ళీ సినిమాలు ఇస్తుంటారు" అని వర్తమాన తెలుగు సినీ దర్శకుడు ఒకరు వాపోయారు.

'కె. బాలచందర్, మణిరత్నం, శంకర్, శ్యామ్ బెనెగల్ లాంటి వాళ్ళు దేశంలో ఒక్కరే! వారికి ప్రత్యామ్నాయం వేరొకరు లేరు. అలాంటి దర్శకులు వచ్చి తెలుగు సినిమా చేస్తున్నారంటే అర్థం ఉంది. అంతేకానీ, తమిళ పరిశ్రమలో ఒక్క హిట్ ఇచ్చారనో, మరొకటనో మామూలు వాళ్ళను సైతం పిలిచి, సినిమా అవకాశాలివ్వడం, స్థానికంగా ఉన్న ప్రతిభావంతులను పట్టించుకోకపోవడం దారుణం" అని దర్శకుడు సాయిబాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పొరుగింటి పుల్లకూర ఎంత రుచి అంటే - ఒక్క సాంకేతిక నిపుణులనే కాదు, చివరకు నటీనటుల విషయంలో కూడా పరాయివారికే పెద్ద పీట అయిపోయింది. తమిళ, మలయాళ దర్శకులు 'నంది అంటే నంది, పంది అంటే పంది' అనాల్సిన దుస్థితిలోకి మన నిర్మాతలు జారిపోయారు. అవసరం

'డార్లింగ్'లో ఓ దృశ్యం

లేకపోయినా సరే తన ప్రాంత నటీనటులను సదరు పరాయి భాషా దర్శకుడు పిలిచి మరీ వేషాలిస్తున్నా, రానూపోనూ ప్రయాణ ఖర్చులు - బసలతో బడ్జెట్‌ను పెంచేస్తున్నా తెలుగు నిర్మాత నోరు మెదపలేకపోతున్నాడు. ఈ మధ్య 'డార్లింగ్', 'ఆరెంజ్' చిత్రాల్లో ప్రభు పోషించిన పాత్రలకు సరిపడే తెలుగు నటులు ఎవరూ లేరని అనుకోవాలా? అలాగే, త్వరలోనే సెట్స్ మీదకు వస్తున్న '3 ఇడియట్స్' తెలుగు రీమేక్‌లో కాలేజీ డీన్ పాత్రకు తమిళ నటుడు సత్యరాజ్‌ను ఎంచుకోవడమెందుకో అర్థం కాదు. ఆ మాటకొస్తే, శంకర్ దర్శకత్వంలో తయారుకానున్న ఆ తెలుగు రీమేక్‌లో హీరో మహేష్‌బాబు మినహా మిగిలిన ముఖ్యపాత్రలన్నీ తమిళ నటులే పోషిస్తున్నట్లు అభిజ్ఞవర్గాల భోగట్టా. అంటే, తెలుగు సినిమాలో నటించడానికి తగిన తెలుగు నటీనటులే లేరా!

స్థానికంగా ప్రతిభావంతులు లేరా?

వరస చూస్తే, స్థానికంగా సరైన ప్రతిభావంతులు ఎవరూ లేకపోవడం వల్లే దర్శక, నిర్మాతలు, హీరోలు ఇలా పరాయివాళ్ళపై అతిగా ఆధారపడుతున్నారేమో అనిపిస్తుంది. కానీ, అది వాస్తవాలకు విరుద్ధమైన అనుమానం. తెలుగు పరిశ్రమ ఇంకా హైదరాబాద్‌లో స్థిరంగా వేళ్ళూనుకోకముందు, దశాబ్దిన్నర క్రితం దర్శకుడు కృష్ణవంశీ తీసిన 'గులాబీ' చిత్రంలో హీరోయిన్ మహేశ్వరి మినహా మిగిలిన సాంకేతిక నిపుణులు, నటీనటులు మన స్థానికులే! అప్పటికే నిపుణులైన సినీ కార్మికులు అంతమంది ఉంటే, పరిశ్రమ ఇక్కడే స్థిరపడిపోయి ఇన్నేళ్ళయ్యాక ఇప్పుడు ఇంకెంత మంది ఉంటారో ఊహించుకోవచ్చు. 'ఢీ' లాంటి టీవీ డ్యాన్స్ షోలో ప్రతిభ కనబరచిన రఘు అనే పక్కా హైదరాబాదీ తెలుగు కుర్రాడికి ఆ మధ్య 'ఆర్య -2' చిత్రంలో అవకాశం దక్కింది. అందులో 3 పాటలకు అల్లు అర్జున్‌తో అతను వేయించిన స్టెప్పులు ఎంతో పేరు తెచ్చి, క్రేజు సృష్టించాయి. అలాంటి స్థానిక ప్రతిభావంతులను ప్రోత్సహించడం మానేసి, ఇప్పటికీ మన సినీ రూపకర్తలు లారెన్స్, రాజు సుందరం లాంటి పరాయి రాష్ట్రాల నృత్య దర్శకుల మీదే ఆధారపడుతున్నారు. అలాగే, 'కొమరం పులి' లాంటి చిత్రాలకు అవసరం కన్నా ఆకర్షణ కోసం టినూ వర్మ లాంటి బొంబాయి ఫైట్ మాస్టర్లను రప్పిస్తున్నారు. ఎవరో, ఏదో సినిమాకు ఉపయోగించుకున్నారని తమ సినిమాకు అవసరమా, కాదా అని చూసుకోకుండా పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం లాగా వ్యవహరిస్తున్నారు. ఆ మేరకు చిత్ర నిర్మాణ వ్యయాన్ని చేతులారా పెంచుకుంటున్నారు. స్థానిక కార్మికుల నోట మట్టి కొడుతున్నారు.

మారాల్సిన మనస్తత్వం

పరాయి చిత్రాల మీద ప్రేమతో మన నిర్మాతలు అవతలివాళ్ళకు దాదాపు దాసోహం అనేస్తున్నారు. అనువాద చిత్రాల నిర్మాణంలోనూ ఈ బానిస మనస్తత్వం కనిపించేస్తోంది. ఇటీవల ఏ తమిళ చిత్రాన్ని తెలుగులోకి అనువదిస్తున్నా, ఆ చిత్ర హక్కులు కొనుక్కున్న తెలుగు నిర్మాత కన్నా తమిళ మూల చిత్ర నిర్మాణ సంస్థల పేర్లు ప్రముఖమైపోయాయి. నిర్మాత కన్నారావు అక్షరాలా రూ. 27 కోట్లు పోసి కొన్న 'రోబో' చిత్రం 'సన్ పిక్చర్స్' సమర్పణగానే ప్రచారమైంది. కమలహాసన్ తాజా 'మన్మథ బాణం' ప్రచారంలో లక్ష్మీ గణపతి ఫిల్మ్స్ కన్నా తమిళ నిర్మాత ఉదయనిధి స్టాలిన్ పేరు, వారి 'రెడ్ జెయింట్ ఫిల్మ్స్' పేరే ప్రముఖమై కూర్చుంది. సమాన భాగస్వామ్యంతో రూపొందిస్తున్న చిత్రాలకైతే ఇలాంటి ప్రచారం ఫరవాలేదు కానీ, లేనప్పుడు ఇలా ఎందుకు సాగుతోందంటే మనవాళ్ళ దగ్గర సమాధానం లేదు. పోనీ, మన 'అరుంధతి' లాంటి పెద్ద నిర్మాతల, భారీ చిత్రాలు తమిళంలోకి అనువాదమైనప్పుడు మన తెలుగు నిర్మాణ సంస్థ పేరు సమర్పణగా వేస్తున్నారా? లేదు కదా!

ఈ బానిస మనస్తత్వం, పరాయివాళ్ళపై అనవసరంగా ఆధారపడే ధోరణి పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే, సినీ పరిశ్రమలో తాజాగా ఎదురైన సంక్షోభం కేవలం ఒక రాష్ట్రానికి చెందిన అయిదారుగురు ఫైటర్లకూ, మరో రాష్ట్రానికి చెందిన మరో అయిదారుగురికీ మధ్య జరిగిన బహిరంగ ముష్టి యుద్ధం మాత్రమే కాదు. అంతర్గతమైన అనేక సమస్యలకూ, సాగుతున్న బోలెడంత దుర్మార్గానికీ బాహాట ప్రకటన. "ఈ తాజా సంక్షోభాన్ని నేపథ్యంగా తీసుకొని, వివిధ రకాల సమస్యల పరిష్కారానికి మేము ప్రయత్నిస్తున్నాం" అని నిర్మాత డి. సురేష్ బాబు అన్న మాటలు ఇక్కడ గుర్తుంచుకోవాలి. నిజంగానే, వివిధ సమస్యలపై ఇప్పుడు పరిశ్రమ దృష్టి పెట్టడం అవసరం. అలా కాకుండా, కేవలం పై పై పరిష్కారాల కోసం ప్రయత్నిస్తే మాత్రం ప్రయోజనం శూన్యమే!

- రెంటాల జూనియర్

చూద్దామా

నయాగరా సొగసులు

సోయగాల నయాగరా జలపాతాన్ని చూసే వరకు అనుకోం అది అంత అందమైనదని. నీరు పాలధారల్లా కనిపించడమేంటి? దాని ఒయ్యారాలు, సొగసులు చూచి మనసు పరవశించడమేంటి? అవనికి దిగివచ్చిన ఆకాశగంగలా అగుపడడమేంటి? అని తెగ ఆశ్చర్యపోయిన మనమే....'ఔను అవన్నీ నిజమే సుమా' అనుకొంటాం. జలపాతం ఉధృతిని చూచి మైమరచిపోతాం. అల్లంత దూరాన నిలబడిన మనల్ని తన చిలిపి తుంపరలతో తడిపి మరీ పలకరించే నయాగరాను మర్చిపోలేం. ఆ అద్భుతానుభూతిని జీవితాంతం నెమరువేసుకుంటూనే వుంటాం.

ప్రపంచంలో తప్పక చూడాల్సిన వాటిలో సోయగాల నయాగరా ఒకటి. ఇది ప్రపంచంలోకల్లా వెడల్పయిన జలపాతం. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ప్రవహించే చిన్న నది. అసలు అక్కడికి వెళుతున్నామూ అంటేనే మనసంతా ఉద్విగ్నతతో నిండిపోతుంది. తీరా అక్కడికెళ్లాక ... ఆ అందాలను కనులనిండా నింపుకోవడంలోనూ, ఆస్వాదించడంలోనూ మునిగిపోతాం.

నయాగరా జలపాతం మొత్తం పొడవు 60 కి.మీటర్లకు మించదు. ప్రవాహ ఉధృతీ తక్కువే. మరి దీని ప్రత్యేకత ఎక్కడవుందీ? అనిపిస్తుంది. ఈ చిన్న నది సుమారు 180 అడుగుల లోతులో పడే దృశ్యం మనల్ని కట్టిపడేస్తుంది. ఆ మనోహర, మనోజ్ఞ దృశ్యం చూసినవారి తనువు పులకించిపోతుంది. కెనడావైపు సుమారు 2000 అడుగుల వెడల్పులో గుర్రపు నాడా ఆకారంలో 140 అడుగుల లోతులో జల పడుతుంది. అమెరికా వైపు జలపాతం మరింత లోతైనది. కానీ వెడల్పే తక్కువ.

కెనడావైపు జలపాతం చూడాలంటే కెనడా వీసా కావాలి. అయితే గ్రీన్‌కార్డ్ వున్నవారికి అది అవసరం లేదు. డెట్రాయిట్ నుంచి నయాగరా సుమారు 300 మైళ్ల దూరం. డెట్రాయిట్‌కు దక్షిణంగా వున్న కెనడాలో అయితే ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన సీఎన్ టవర్ వుంది.

అక్కడ జలపాతం వ్యూ వున్న హోటళ్లకు గిరాకీ ఎక్కువగా వుంటుంది. అక్కడ ఏదైనా హోటల్లో గది తీసుకొని కిటికీలోంచి నయాగరా చూస్తుంటే వుంటుందీ...! ఇంక నోట మాటే రాదు. అలా చూస్తుండిపోతాం ఎంతసేపైనా. మరీ మొదటిసారి చూసేవారైతే ఇంక అంతే సంగతులు. ఇంక జలపాతం దగ్గరున్న టేబుల్ రాక్ కాంప్లెక్స్ చూడదగినది. అదే జలపాతానికి 20 అడుగుల దూరంలో నిలబడ్డాం అనుకోండి. నిమిషానికి 20 కోట్ల లీటర్ల నీరు 170 అడుగుల లోతుకు పడుతుంటే ఆ హోరు, వందల అడుగుల ఎత్తుకు లేచి పడే నీటి తుంపర అలలు... అసలు మాటల్లో ఎలా చెప్తాం! ఆ అందాన్ని వర్ణించడానికి ప్రపంచంలో వున్న ఏ భాషా సరిపోదేమో అనిపిస్తుంది. ఆ తుంపరలు మనల్ని తడిపేస్తుంటే వుంటుందీ...

జర్నీ బిహైండ్ ద హిల్స్ సంగతి మర్చిపోతే ఎలా! టేబుల్ రాక్ ఆఫీసులోనే టికెట్ తీసుకొంటే ఒక రెయిన్ కోట్ (డిస్పోజబుల్) ఇచ్చి లిఫ్టులో 125 అడుగులు కిందికి తీసుకెళతారు. అక్కడ అద్దాల తలుపులోంచి జలపాతాన్ని బాగా దగ్గరగా చూడొచ్చు. నీటి మట్టానికి 26 అడుగుల ఎత్తులో ఒక బాల్కనీ వుంది. మూడు వైపులా రెయిలింగ్స్ వుంటాయి. చల్లచల్లటి నీటి తుంపరలు అలా మొహం మీద పడి పలకరిస్తుంటే వుంటుందీ... ఆ ఆనందం మరెప్పుడూ కలగదేమో! రెయిన్ కోట్ కూడా తీసేసి తడిచిపోవాలనిపిస్తుంది.

అక్కడ భారతీయులే కాదండోయ్! యూరోపియన్లు, చైనీయులు, ఆఫ్రికన్లు ... ఎంతోమంది విదేశీయులు చిన్నపిల్లల్లా కేరింతలు పెడుతూ జలపాతం తుంపర జల్లుల్లో తడిచిపోతుంటారు. తర్వాత అక్కడినుంచి టన్నెళ్ల ద్వారా అద్దం బిగించిన కిటికీ లోంచి మరింత దగ్గరగా నీటిని చూడొచ్చు. ఆ తర్వాత పైకి వచ్చి వేడివేడి కాఫీ తాగుతూ... జలపాత దృశ్యాలను చూస్తుంటే గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి.

జలపాతాన్ని మరింత దగ్గరగా చూసే వీలు కూడా వుంది. అదెలా అంటారేమో! అదెలాగంటే... మెయిడ్ ఆఫ్ ది మిస్ట్ యాత్ర ద్వారా. అక్కడి గుర్రపు నాడా ఆకారంలో వున్న నదిభాగంలోకి తీసుకెళతారు. దీనికి కూడా ప్రత్యేకమైన టికెట్టుకొనాలి. అందరికీ రెయిన్ కోట్లు ఇస్తారనుకోండి. మనం ఎక్కిన బోటు పక్కగా 170 అడుగుల ఎత్తు నుంచి పడే నీటి ఉధృతి, తుంపర్లు ...



పైగా మనం ఎక్కిన బోటు జలపాతానికి దగ్గరగా వెళుతూ వుంటే భయం పెరుగుతూ వుంటుంది. అయితే అదేదో సాహస యాత్రలాగా బావుంటుందిలెండి. మొహం మీద పడుతున్న తుంపరలను తుడుచుకోవడం కూడా మర్చిపోయి అలా చూస్తుండిపోతారెవరైనా. కాసేపటి తర్వాత తిరిగి బోటు మనల్ని వెనక్కి తీసుకెళ్తుంది. రాత్రిపూట జలపాతం దగ్గర ఏర్పాటు చేసిన మూడు నాలుగు రంగులు లైట్లు చూస్తే మతిపోవాల్సిందే.

వయోబేధం లేకుండా నయాగరా జలపాతం అందాలను అంతా ఆస్వాదిస్తారు. ఇక కొత్తగా పెళ్లయినవారికైతే అది స్వర్గమే అనుకోండి. ఇక్కడ చూడ్డానికి ఈ జలపాతం ఒక్కటేనా మరేం లేవా? అనుకోకండి. చాలానే వున్నాయి. మెరైన్ ల్యాండ్ అనే ప్రాంతంలో తిమింగలాలు, డాల్ఫిన్లు, సీ లయన్లు ... వంటి ఎన్నో సముద్ర జంతువులు కూడా కన్పిస్తాయి. కొన్నింటినైతే తాకొచ్చు కూడా. డాల్ఫిన్ షో చాలా బావుంటుంది. అక్కడ చాలా పెద్ద స్టీల్ రోలర్ కోస్టర్ వుంది. దాని మీద ఆడుకోడానికి పిల్లలు తెగ ఆరాటపడతారు.ఇదే కాదు. కేబుల్ కారులో జలపాతం చూడడం... తుంపర్లలో తడవడం కూడా గొప్ప అనుభూతి. అక్కడ 600 అడుగుల ఎత్తయిన మినోల్టా, 800 అడుగుల ఎత్తున్న స్కైలాన్ టవర్లమీదనుంచి కూడా జలపాతాన్ని చూడొచ్చు. స్కైలాన్ టవర్మీద రివాల్వింగ్ హోటల్ వుంది. అది తన చుట్టూ తాను తిరుగుతూ వుటుంది. అందులో కూర్చుని టిఫిన్ తింటూ, కాఫీ తాగుతూ జలపాతాన్ని వుంటే చాలా బావుంటుంది. బొటానికల్ గార్డెన్లో 2300 రకాల గులాబీలు పూస్తాయని చెప్తుంటారు. అక్కడి బటర్ఫ్లై కన్జర్వేటరీ కూడా మనల్ని కట్టిపడేస్తుంది. అందులో 2000 రకాల సీతాకోకచిలుకలు తమ రంగురంగుల రెక్కలను ఆడిస్తూ వయ్యారంగా పోతుంటే మన మనసు ఒకచోట నిలవదు సుమా! క్లింటన్ హిల్ ఏరియా దగ్గరకు వెళ్లాము అంటే పిల్లలు వదిలి రానేరారు. ఇవేకాక రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్, రిప్లీస్ మూవింగ్ థియేటర్, గిన్నిస్ మ్యూజియం, వ్యాక్స్ మ్యూజియం, గుర్రపుబగ్గీ సవారీ... అన్నీ చూడాల్సినవే.

ఇక డెట్రాయిట్ పట్టణం ప్రత్యేకంగా చూడదగినది. ఇది డెట్రాయిట్ నది ఒడ్డున వుంది. తమాషా ఏంటంటే ఇక్కడ కూసింత దొంగల బెడద ఎక్కువే. కానీ మ్యూజియంలకు పేరుగాంచిన ప్రాంతం. అందుకేనేమో దీన్ని మ్యూజియంల నగరం అని కూడా పిలుస్తారు ముద్దుగా. ఇక్కడ... హెన్రీఫోర్డ్ మ్యూజియం, ఐమ్యాక్స్ థియేటర్ వున్న కాంప్లెక్స్ అద్భుతంగా వుంటాయి. వీటి తర్వాత చూడాల్సింది బెల్లీ ఐలాండ్. ఇది అమెరికా మొత్తంలోకి అతి పెద్ద ఐలాండ్ పార్కు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ పార్కులో పాలరాతి లైట్ హౌస్, బీచ్, అన్ని రకాల ఆటలు ఆడుకొనేందుకు మైదానాలు, పూలమొక్కలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు ... ఒకటేంటి...అన్నీ కనిపిస్తాయి.

మనం ఇప్పటి వరకు కెనడావైపున్న నయాగరా అందాలను మాత్రమే చెప్పుకున్నాం. ఇప్పుడు అమెరికా వైపున్న అందాలను చూద్దాం. ఇది కొంచెం దూరం ఎక్కువే అనుకోండి. న్యూయార్క్, న్యూజెర్సీ, మేరీల్యాండ్ లో వుండేవారికి దగ్గర. ఆ పక్కనే వున్న నయాగరా నదిలో చూడాల్సింది గోట్ ఐలాండ్. అమెరికన్ ఫాల్స్కు, కెనడా ఫాల్స్కు మధ్యలో ఈ ఐలాండ్ వుంది. ఇక్కడ రెండు జలపాతాలు కనిపిస్తాయి. అమెరికన్ ఫాల్స్ బ్రైడల్ వీల్ అంటారు వీటిని. లిఫ్టులో 175 అడుగులు దిగి, జలపాతానికి 25 అడుగుల దగ్గరకు వెళ్లొచ్చు. పూర్తిగా తడిచిపోతామనుకోండి. ఇక్కడ కూడా మెయిడ్ ఆఫ్ ద మిస్ట్ ట్రిప్ వుంటుంది. కాకపోతే కెనడావైపు జలపాతం చూడ్డానికి అయ్యే ఖర్చుకంటే ఇక్కడ అన్నీ రేట్లు ఎక్కువే. ఇక్కడ మరో తమాషా ఏంటంటే... హీలియం బెలూన్లో కూర్చుని 400 అడుగుల ఎత్తు నుంచి జలపాతం చూడొచ్చు. మరో ముఖ్యమైన విషయమేమంటే నయాగరా హిస్టరీ మ్యూజియంలో డయానా, మదర్ థెరిస్సా వంటి ప్రముఖుల బొమ్మలు వుంటాయి. వీటిని చూస్తుంటే బొమ్మలనుకోం. నిజంగా సదరు మనుషులే అక్కడ నిలబడినట్టు అనిపిస్తుంది.

ఇవండీ నయాగరా జలపాతం ముచ్చట్లు. ఇప్పుడేమనిపిస్తోంది! ఎలాగైనా సరే... అక్కడికెళ్లి జలపాతం తుంపర్లలో తడిచిపోవాలనిపిస్తోందా!







వికీలీక్స్ విస్ఫోటనం

'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ ఓడిపోలేదోయ్...' అని పాడతాడు దేవదాసు. కానీ మొత్తం భూమండలంపై ఏకఛత్రాధిపత్యం వహించాలని చూస్తున్న అమెరికా మాత్రం కుడి ఎడమైతే కొంపలంటుకుపోతాయని తెలుసుకున్నట్టుంది. అందుకనే మొదట్లో చైనాకు వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక వ్యవస్థల ప్రచారం కోసం అంటూ తెరమీదకు వచ్చిన వికీలీక్స్ పొరుగు దేశాల రహస్యాలు తమకు చేరవేయటానికి బదులు తమ రహస్యాలే బట్టబయలు చేయటంతో అమెరికా అధినేతల గొంతులో వెలక్కాయ పడింది. పత్రికలు పాలకవర్గాల చంకల్లో పిల్లులుగా మారుతున్న సంపన్న దేశాల్లో 'ఎంబెడెడ్ జర్నలిజం' సైతం వికీలీక్స్ విడుదల చేసిన పత్రాలకు ముఖ్యమైన ప్రతికలు పతాకశీర్షికల్లో స్థానం కేటాయించాల్సిన పరిస్థితి వచ్చింది. పత్రికా స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక హక్కుల గురించి ప్రపంచానికి పాఠాలు చెప్పే అమెరికా తన గురివింద నైజాన్ని బయట పెట్టుకుంది. విలక్షణమైన కేసులో వికీలీక్స్ ప్రధాన బాధ్యుడు జూలియన్ అసాంజేను అరెస్టు చేయించింది. అమెరికా, ఆస్ట్రేలియా, స్వీడన్, స్విట్జర్లాండ్, బ్రిటన్‌లు కూడబలుక్కున్నట్లు వ్యవహరించి అమెరికా విదేశాంగ నీతికి సంబంధించి కీలక పత్రాలు బయట పెట్టిన వికీలీక్స్ పీక నొక్కే ప్రయత్నం చేస్తున్నాయి. లైంగిక విషయాల్లో అసాంజేని దోషిని చేయటం ద్వారా వికీలీక్స్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనుకోవటం అటువంటి ప్రయత్నాల్లో ఒకటి. అసలు ఇంటర్నెట్ ఆధారంగా నడిచే చిన్న సంస్థపై అమెరికా వంటి దేశం అంత పెద్ద దాడి చేయాల్సిన అవసరం ఏమొచ్చింది ? వికీలీక్స్ ఎవరు నడుపుతున్నారు? ప్రధాన స్రవంతికి చెందిన ప్రసార సాధనాలు వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్, టైమ్స్, గార్డియన్ వంటి పత్రికలు చేయలేని పనిని కొద్ది మంది కంప్యూటర్ రహస్యాలు ఛేదించే హాకర్స్‌గా మారిన యువకులు ఎలా చేయగలుగుతున్నారు? అన్న విషయాలు ఈ వారం అట్టమీదికథలో పరిశీలిద్దాం.

వికీలీక్స్ పేరుతో వెబ్‌సైట్ 2006 అక్టోబరు 4న రిజిష్టరు అయ్యింది. కంప్యూటర్‌తోనూ, ఇంటర్నెట్‌తోనూ పరిచయం ఉన్న వారందరికీ వికీపీడియా గురించి తెలుసు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది కంప్యూటర్ విజ్ఞాన సర్వస్వం. అదే తరహాలో అందరికి అందుబాటులో ఉన్న బ్రాండ్‌తో ప్రారంభమైంది ఈ సంస్థ (అయితే ఈ రెంటికీ సంబంధం లేదు. వికీపీడియా దీన్ని మొదట్లోనే పేర్కొంటున్నది). ప్రారంభంలో ఈ సంస్థ నిర్వాహకులు తమను తాము చైనాకు చెందిన అసమ్మతివాదులుగా ప్రకటించుకొన్నారు. దాంతోపాటు తైవాన్-చైనాతో నిరంతరం ఘర్షణ పడుతున్న దేశం- యూరప్, ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికాలకు చెందిన కంప్యూటర్ ఇంజనీర్లు, గణిత మేధావులు పర్యవేక్షణలో పనిచేసే సంస్థగా ప్రకటించుకోవటంతో అమెరికాతో సహా పశ్చిమ దేశాల్లో ఆశ్రయం సంపాదించటం వారికి తేలికైంది. ఆసియా, మాజీ సోవియట్ రష్యాకు చెందిన దేశాల్లో అప్రజాస్వామిక ప్రభుత్వాల గుట్టురట్టు చేయటం తమ లక్ష్యం అని ప్రకటించుకోవటం ద్వారా అమెరికాకు ప్రీతిపాత్రమైన రాజకీయ క్రీడలో తేలికగా ప్రవేశించగలిగారు ఈ సంస్థ నిర్వాహకులు. ఈ విధంగా పశ్చిమ దేశాలకు ప్రత్యేకించి అమెరికాకు అభ్యంతరం కాని విధంగా పని ప్రారంభించిన వికీలీక్స్ సంస్థ 2007 జనవరి నాటికి తమ వద్ద వివిధ ప్రభుత్వాల వ్యవహారాలకు సంబంధించి 12 లక్షల పత్రాలు ఉన్నాయని ప్రకటించింది. ఇదే కాలంలో అమెరికా ఇంటర్నెట్ ద్వారా అమెరికాకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుకునే నిమిత్తం ప్రత్యేక ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా అనేక ఘోస్ట్ వెబ్‌సైట్లు ప్రారంభించింది. వికీలీక్స్ కూడా అందులో ఒకటన్న భావన సర్వత్రా నెలకొంది.

పేరు ప్రతిష్టలు

ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లక్ష్యంగా వికీలీక్స్ చేపట్టిన చర్యలు అనతికాలంలోనే ఉద్యమరూపం తీసుకున్నాయి. ప్రత్యేకించి కెన్యా వంటి దేశాల్లో పాలకులు దేశాన్ని దోచుకుతింటున్న తీరును విపులంగా చిత్రీకరించటం, దాన్ని అంతర్జాతీయ మీడియాకు విడుదల చేయటం వంటి చర్యల ద్వారా వికీలీక్స్ పారదర్శకత కోసం, ప్రజాస్వామిక సంస్కరణల కోసం పని చేసే సంస్థగా గుర్తింపు తెచ్చుకుంది. 2008లో లండన్‌కు చెందిన 'ఎకానమిస్టు' పత్రిక వికీలీక్స్ సంస్థకు నూతన మీడియా దోరణులకు ఇచ్చే అవార్డు ఇచ్చి సత్కరించింది. మానవహక్కుల కోసం పని చేసే 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' 2009 సంవత్సరానికి గాను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ బ్రిటన్ అవార్డును ఇచ్చి వికీలీక్స్ పేరు ప్రతిష్టలు మరింత పెంచింది. 2008లో కెన్యా ప్రభుత్వ దురాగతాలను, మానవహక్కుల ఉల్లంఘనను వెల్లడి చేస్తూ

'రక్త దాహం –కెన్యాలో మానవహక్కుల ఉల్లంఘనలు, అదృశ్యమవుతున్న ప్రజల గాథలు' రూపంలో డాక్యుమెంటరీ రూపొందించినందుకు గాను ఈ అవార్డు పొందింది వికీలీక్స్. న్యూయార్క్ కేంద్రంగా నడిచే డైలీ న్యూస్ అనే పత్రిక రానున్న కాలంలో మీడియా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపగల పరిణామంగా వికీలీక్స్‌ను గుర్తించింది. దౌత్య రహస్యాలు వెల్లడి చేసిన తర్వాత రష్యా ప్రభుత్వం ఒక ప్రకటనలో వికీలీక్స్‌కు నోబెల్ శాంతి బహుమతి అందచేయాలని బహిరంగంగా సిఫార్సు చేసింది.

పాఠాలు నేర్పిన వికీలీక్స్

వికీలీక్స్ వెల్లడించిన విశేషాల గురించి పత్రికల్లో ప్రముఖంగానే చోటు చేసుకున్నాయి. గతంలో ఇటువంటి ప్రయత్నాలు జరిగినపుడు వచ్చిన ప్రచారం, ప్రాచుర్యం కంటే ఇప్పుడు ఎక్కువ ప్రచారం, ప్రాచుర్యం వచ్చాయి. నిన్న మొన్నటి వరకూ అమెరికా యుద్ధ క్రీడలో పావులుగా సైనికులుగా వ్యవహరించిన వారు, ప్రభుత్వ విధానాల పట్ల పూర్తి వైముఖ్యం ఉన్న వారు, పెట్టుబడిదారీ విధానాన్ని సైద్ధాంతికంగా వ్యతిరేకించే వారు అనేక మంది అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలను తూర్పారపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జేమ్స్ పెట్రాస్ వంటి వారు మొదటి కోవకు చెందిన వారైతే మంత్లీరివ్యూ పత్రిక నిర్వాహకులు రెండో కోవకు చెందిన వారు. అయితే వీరికి అంతర్జాతీయంగా వికీలీక్స్‌కు వచ్చినంత ప్రాధాన్యత రాలేదు. జేమ్స్‌పెట్రాస్ తన ఆక్రోశాన్ని, అనుభవాలను 'దళారీ పశ్చాత్తాపం' రూపంలో వెల్లడి చేసుకోవాల్సి వచ్చింది. ఈ పుస్తకం విడుదలైన తర్వాత కూడా అమెరికాకు చెందిన ముఖ్యమైన మీడియా సంస్థలు పెట్రాస్ అనుభవాలు అమెరికా వ్యవహారశైలికి సంబంధించి సార్వత్రిక సత్యాలుగా పరిగణించటానికి వీలు లేదని, ఏదో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన చెప్పిన విషయాలు వాస్తవాలు అయి ఉండే ఉండవచ్చుని వ్యాఖ్యానాలు రాసి అమెరికా వరకు ఈ పుస్తకానికి ఆదరణ లేకుండా చేశాయి. వికీలీక్స్ వెల్లడి చేసిన వివరాలు పెట్రాస్ అనుభవాలు కేవలం వ్యక్తిగతం కాదని, అమెరికా ఆర్థిక రాజకీయ వ్యవస్థలో సంస్థాగతమైన పద్ధతులు అవేనని మరోసారి రుజువు చేస్తున్నాయి.

2000 సంవత్సరం జరిగిన ఎన్నికల్లో బుష్ ఫ్లోరిడా రాష్ట్రంలో రిగ్గింగ్‌కు పాల్పడకపోతే గెలిచి ఉండేవాడు కాదని గ్రెగ్ పలాస్ట్ అనే విలేకరి ఆధారాలతో సహా రుజువు చేశాడు. అయితే ఈ వివరాలను ప్రచురించటానికి అప్పట్లో అమెరికా పత్రికలు గానీ, టీవీలుగానీ ముందుకు రాలేదు. చివరకు ఆయన ఇంగ్లాండ్ వచ్చి లండన్ పత్రికలకు ఈ విషయాలు వెల్లడించిన తర్వాత గానీ బుష్ గుట్టు రట్టు కాలేదు. ఆ తర్వాత కూడా గార్డియన్ వంటి పత్రికల ద్వారా పలాస్ట్ కృషిపై నీళ్ల పోసేందుకు విశ్వ ప్రయత్నాలు జరిగాయి. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో తానే పుస్తకం రాసి అమ్మకానికి అనువైన అతిగొప్ప ప్రజాస్వామ్యం అని ప్రచురించాడు గ్రెగ్ పలాస్ట్.

ఇదే విధమైన పరిస్థితి మంత్లీ రివ్యూ నిర్వాహకులది. అమెరికా ఆర్థిక రాజకీయ వ్యవస్థ విషయంలో నికరమైన శాస్త్రీయ విమర్శకులుగా ఉంది ఈ పత్రిక. కానీ ఈ పత్రిక

నిన్న విశిష్టుడు! నేడు దుష్టుడు!!



జూలియన్ అసాంజే.. ఈ పేరు ప్రపంచాధిపత్యశక్తిని ప్రకంపింపచేస్తోంది. వికీలీక్స్ వ్యవస్థాపకుడైన అసాంజే అమెరికా ఆఫ్ఘన్ తదితర దేశాల ప్రజల పాలిట శత్రువనే ప్రచారం మోత మొగుతున్నది. అతన్ని లండన్‌లో అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. తమకు అప్పగించాలని స్విట్జర్లాండ్ వత్తిడి చేస్తుంటే తెర వెనక నుంచి అమెరికా వేట సాగిస్తున్నది. ఇంతకూ ఈ వికీ విలన్ నిన్న విశ్వ విఖ్యాత హక్కుల యోధుడుగా ఇదే శక్తులతో నీరాజనాలందుకున్నాడంటే నమ్మడం కష్టమే, కాని నిజం. చాలా మంది సంచలనకారులు వివాద కారకుల్లాగే అసాంజే జీవితం కూడా ఆసక్తికరమైన మలుపులతో నిండి వుంటుంది. నాటకీయత పొంగిపొర్లుతుంటుంది. 1971 జులై 3న ఆస్ట్రేలియాలో జన్మించిన అసాంజే బాల్యం తల్లి విడాకులు పునర్వివాహాల మధ్య నడిచింది. చిన్నప్పటి నుంచీ సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువే కావడంతో 16 ఏళ్లకల్లా ప్రపంచ స్థాయి కంప్యూటర్ హ్యాకర్ అయ్యాడు. అంటే కంప్యూటర్లలో నిక్షిప్తమైన సమాచారాన్ని రాబట్టే లాఘవం అన్న మాట. ఒకానొక చలన చిత్రంలోని పేరును తీసుకుని మాండెక్స్ పేరిట హ్యాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఇదంతా చేసేప్పుడు 'కంప్యూటర్లు పాడవకూడదు, తీసుకున్న సమాచారాన్ని మార్చకూడదు, దాన్ని అందరితో పంచుకోవాలి' అని మూడు సూత్రాలు పెట్టుకున్నాడు. 1989 లో 'బేల్స్ ఆఫ్ హ్యాకింగ్' తదితర పుస్తకాల రచనలో పాలుపంచుకున్నాడు. 1991 నాటికి రహస్య సమాచార సేకరణ అందరూ గుర్తించే స్థాయికి చేరింది. 1992లో కంప్యూటర్ సంస్థలైన నార్టెల్, మోడెమ్‌లను హ్యాక్ చేశాడు. 2006లో వికీలీక్స్ స్థాపించి దానికి ప్రధాన సంపాదకుడుగా పనిచేస్తున్నాడు. మానవ హక్కుల కోసం విశేషంగా కృషి చేస్తున్నందుకు 2008లో ఎకనామిస్ట్ పత్రిక అవార్డు ఇచ్చింది. కెన్యాలో చట్టవిరుద్ధ హత్యాకాండను గురించి బయటపెట్టినందుకు ఆయనకు 2009లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అవార్డు ఇచ్చారు. అలాగే ఆఫ్రికాలో విష పదార్థాల గుమ్మరింపు గురించి, ఆ ప్రాంతంలోని ఒక చర్చి నిగూఢ కార్యకలాపాల గురించిన సమాచారాన్ని కూడా ప్రపంచానికి అందించాడు. ఇవన్నీ అసాంజే గురించిన ఆసక్తిని పెంచాయి. ఆయన ఎక్కడు వుంటాడనే దానిపై ఎవరికీ స్పష్టత వుండేది కాదు. ఆస్ట్రేలియా దేశస్థుడైనా అక్కడ వున్నది తక్కువ. కెన్యా, స్విట్జర్లాండ్, బ్రిటన్, ఐస్‌లాండ్ వగైరా చోట్ల నివసిస్తూ ఎక్కడున్నా రహస్య సమాచార సేకరణ కొనసాగిస్తూ వచ్చాడు. అయితే 2010 నవంబరు 20 అమెరికా విదేశాంగ కార్యాలయానికి సంబంధించిన రహస్య పత్రాల ప్రకటన ప్రారంభించగానే ఈ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. మానవ హక్కుల యోధుడు కాస్తా దేశ ద్రోహి అయిపోయాడు! ఇంతకూ వీటిని ప్రచురించింది ప్రసిద్ధ పత్రికలే. దాంతో ఒక్కసారిగా అమెరికా సైనిక రాజకీయ నేతలు హడలెత్తిపోయారు. నవంబరు 20న ఆయన ఈ పని ప్రారంభించగా 30న స్విట్జర్లాండులో అత్యాచారాల కేసు నమోదైంది. మరో వంక దేశ రహస్యాల చట్టం కింద ఆయనను అప్పగించాలని అమెరికా వత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలోనే లండన్‌లో తనుగా దొరికి పోయిన అసాంజే కోర్టులో హాజరైనాడు. అసాంజే గురించిన నిజానిజాలన్ని పూర్తిగా తెలియక పోయినా ఈ సమయంలో వేటాడటం వెనక రాజకీయాలున్నాయన్నది స్పష్టం. అందుకే అంతర్జాతీయంగా తనపట్ల సంఘీభావం కూడా వ్యక్తమవుతున్నది. రహస్యాలు కాపాడుకోలేకపోవడం అధికారుల లోపం తప్పు అందిన వాటిని ప్రచురించడం మీడియా తప్పు కాదన్నది సాధారణ అభిప్రాయం.ఇదే విధమైన కేసుల్లో అమెరికా పత్రికా స్వాతంత్ర్యం పేరిట చేసిన హడావుడి అందరికీ తెలుసు. అసాంజేకు ఆమ్నెస్టీ తదితర అవార్డులు ఇచ్చినపుడు తమకే ఉపయోగపడతాడనుకున్నారు..వాస్తవంలో 2010 నోబుల్ బహుమానం ఆయనకే ఇవ్వాలని టైమ్ పత్రిక ప్రతిపాదించింది కూడా! ఎదురు తిరిగేసరికి ద్రోహి అంటున్నారు.అయితే బ్రెజిల్ అధినేత లూలా డిసిల్వా వంటివారు బహిరంగంగానే అసాంజేను సమర్థిస్తున్నారు. రష్యా కూడా మొదటి నుంచి అసాంజేకు మద్దతునిస్తున్నది. ఆయన బెయిలుకోసం ప్రసిద్ధ దర్శకుడు మైకెల్ మూర్ జామీను మొత్తం చెల్లించినప్పటికీ ఇంకా విడుదల కాలేదు. అతన్ని స్విట్జర్లాండుకు అప్పగిస్తారన్న సూచనలున్నాయి.

-పీవీ

ప్రభావం, పలుకుబడి పరిమితం కావటంతో ఈ పత్రిక వెల్లడి చేసే విశ్లేషణలు, వాస్తవాలు జనసామాన్యానికి చేరుకునే పరిస్థితి లేదు. దాంతో పత్రిక నిర్వాహకులే ముఖ్యమైన పరిణామాలకు సంబంధించిన వ్యాసాలు పుస్తకాలుగా మార్చి అంతర్జాతీయ మార్కెట్‌లో విడుదల చేస్తున్నారు. తాజా ఉదాహరణ ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభానికి సంబంధించినది. మంత్లీ రివ్యూ పత్రికలో 2004 నుండే రానున్న సంక్షోభం గురించి పెద్దఎత్తున హెచ్చరికలు, విశ్లేషణలు వచ్చాయి. కానీ బుష్ నేతృత్వంలో సామ్రాజ్యవాదం కిక్కు తలకెక్కించుకున్న అమెరికా పాలకులకు, విధాన నిర్ణేతలు ఈ హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. దాంతో సంక్షోభం మొదలైన తర్వాత 2008-2009 మధ్య మంత్లీ రివ్యూ రచయితలు రెండు చిన్న పుస్తకాలు ఈ వ్యాసాలను అచ్చేశారు.

ఈ విషయాలకు, వికీలీక్స్‌కు మధ్య సంబంధం ఏమిటన్న ప్రశ్న పాఠకులకు తలెత్తవచ్చు. ఇది జర్నలిజం వృత్తి నైపుణ్యానికి సంబంధించిన అంశం. దాదాపు శతాబ్ద కాలం క్రితం మీడియా సాధనాలపై గుత్తాధిపత్యం పెరగటం, ఈ గుత్తాధిపత్యం వహిస్తున్న శక్తులకు, ఆయా దేశాల్లోని రాజకీయ ఆర్థిక పెత్తనం చలాయిస్తున్న శక్తులకు మధ్య అవినాభావ సంబంధం ఉండటంతో తాము ఇచ్చే వార్తలు, వెల్లడించే రహస్యాలు నిష్పాక్షికమైనవని మీడియా సంస్థలు రుజువు చేసుకోవాల్సి వచ్చింది. ప్రత్యేకించి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పత్రికలు ముందుకు తెచ్చే నూతన ప్రత్యామ్నాయాలు, విధానాల వెనక నిర్దిష్టంగా కొన్ని కంపెనీలకు లాభం చేకూరే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రికల్స్, వెస్టింగ్టన్ వంటి అణు ఇంధన రియాక్టర్లు తయారు చేసే కంపెనీలకు ప్రపంచవ్యాప్తంగా అణు ఇంధన ఉత్పత్తి ప్రారంభమైతే ప్రయోజనం. వారికి గిరాకి తగులుగుతుంది. అందుకనే స్వచ్ఛమైన ఇంధనం, హరిత ఇంధనం పేరుతో దశాబ్దంన్నరకు పైగా స్వతంత్ర సంస్థల ద్వారా ప్రచారం చేపట్టారు. చివరకు భారతదేశంతో అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేవిధంగా అమెరికాకు చెందిన ఎఐజి కంపెనీ. బీమా రంగంలో, పెన్షన్ రంగంలో విదేశీ కంపెనీల ప్రవేశానికి అవసరమైన వార్తలు, విశ్లేషణలు వచ్చి, ఈ వార్తలు విశ్లేషణలు మనలాంటి దేశంలో ఏ ప్రణాళికా సంఘాన్నో, ఆర్థిక శాఖలో ఉన్నతాధికారులనో ప్రభావితం చేస్తే ఎఐజి వంటి కంపెనీలు మన దేశంలో యదేచ్ఛగా ప్రవేశించవచ్చు. ఈ విధమైన పరిస్థితిలో ప్రజలు సదరు పత్రికల్లో వచ్చే వార్తలను నమ్మటం సాధ్యం కాదు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిందే వృత్తినైపుణ్యం కలిగిన పాత్రికేయత. ఈ తరహా పాత్రికేయత్వంలో రాసే వార్తకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో, ఏ సమాచారం ఆధారంగా సదరు వార్త రాస్తున్నామో అన్న విషయానికి కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది. ప్రత్యేకించి పాశ్చాత్య దేశాల్లో దీనికి మరింత ప్రాధాన్యత ఉంటుంది. పై అనుభవాల నేపథ్యంలో అమెరికా మీడియా శక్తి సామర్థ్యాలు అర్థం చేసుకున్న వికీలీక్స్ నిర్వాహకులు భిన్నమైన వ్యూహం రూపొందించారు. తమవద్ద ఉన్న రహస్య పత్రాలు, వివిధ దేశాలకు, అమెరికాకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించేవి కావటం వీరికి కలిసి వచ్చిన అంశం. దాంతో లండన్, పారిస్, బెర్లిన్, వాషింగ్టన్‌ల నుండి ఒక్కో పత్రికను ఎంచుకుని తమ వద్ద ఉన్న రహస్యాలను ముందుగా ఆయా పత్రికలకు చేరవేశారు. ఇవన్నీ వృత్తినైపుణ్యం కలిగిన పాత్రికేయుల చేతుల్లోని పత్రికలు. దాదాపు రెండు నెలలుగా శోధించి, సరి చూసుకుని, వికీలీక్స్ వద్ద ఉన్న పత్రాలు అసలువా, నకిలీవా అన్న విషయాన్ని రుజువు చేసుకున్న తర్వాతనే ఈ పత్రికలు కొద్ది కొద్ది సమాచారాన్ని ప్రచురించాయి. ఉదాహరణకు న్యూయార్క్ టైమ్స్, గార్డియన్ పత్రికలు వికీలీక్స్ ఇచ్చిన సమాచారానికి సంబంధించిన వివరాలు రేఖామాత్రంగా ఇంటర్నెట్‌లో ఉంచారు. ఒకటి రెండురోజుల్లో అది కూడా తీసేశారు. ఈ విధంగా వృత్తినైపుణ్యం పట్ల మక్కువ చేసే సంపన్న దేశాల పాత్రికేయులకు అదే వృత్తినైపుణ్యంతో గుణపాఠం నేర్పింది వికీలీక్స్.

వికీలీక్స్ ప్రవాహం...

చివరిగా వికీలీక్స్ వెల్లడించిన వివరాల గురించి క్లుప్తంగా ప్రస్తావించుకుందాం. ఇప్పటి వరకూ మూడు దఫాలుగా వికీలీక్స్ తన వద్ద ఉన్న సమాచారాన్ని వెల్లడించింది. తొలుత

ప్రధాన మీడియాకు ప్రత్యామ్నాయం!

గుత్తాధిపతుల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు ప్రలోభాల వల్ల కనిపించే వాస్తవాలను ప్రజలకు నివేదించడంలో ప్రధాన స్రవంతి మీడియా సాధనాల వైఫల్యం పెద్దఎత్తున కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ వైఫల్యాన్ని పూరించేందుకు బ్లాగ్‌ల రూపంలో, లాభాపేక్ష ఆశించని ఇంటర్నెట్ మీడియా సాధనాల రూపంలో, సోషలిస్టు భావాలు వ్యాప్తి చేసే సాలిడ్ నెట్ రూపంలో అనేక ప్రత్యామ్నాయ మీడియా సాధనాలు ముందుకొచ్చాయి. ఆ విధంగా తెరమీదకు వచ్చిన వికీలీక్స్ కంప్యూటర్ ద్వారా రహస్యాలు ఛేదించే ప్రక్రియ హ్యాకింగ్ నైపుణ్యంతో వివిధ దేశాల ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని తమ వద్ద నిక్షిప్తం చేయగలిగింది.

ఇంటర్నెట్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన సమయంలో సమాచారానికి కొరత లేదు. అయితే ఏ సమాచారం, ఎంత మేర అందుబాటులో ఉండాలి అన్న విషయాన్ని నిర్ధారించేది ప్రభుత్వాలు, ప్రభుత్వాలతో కుమ్మక్కైన ఇంటర్నెట్ సంస్థలు పారదర్శకత జపం చేస్తూనే తమ పాలకుల వర్గ ప్రయోజనాలకు నష్టం లేని సమాచారాన్ని మాత్రమే అందుబాటులోకి తెస్తాయి. ప్రపంచం ముందుంచుతాయి. ఉగ్రవాదంపై యుద్ధ సమయంలో అమెరికాలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామం అదే. ఎంపిక చేయబడిన మీడియా సంస్థల ప్రతినిధులకు ప్రభుత్వమే సమాచారం ఇచ్చి విశ్లేషణలు, వ్యాఖ్యానాలు రాయించటం ద్వారా - కెజి బేసిన్ గ్యాస్ ధర విషయంలో నీరా రాడియా సూచనల మేరకు వీర్‌సంఘ్వి విశ్లేషణ రాసినట్లు- హాని లేని సమాచారాన్ని మాత్రమే బయటకు వదలటం మీడియా మేనేజ్‌మెంట్‌లో భాగంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలు అమలు జరిగిన సమయంలో 1994-2004 మధ్యకాలంలో ప్రపంచ బ్యాంకు ఎంతవరకు సమాచారం అందుబాటులోకి తెస్తే అంతే సమాచారాన్ని ఢిల్లీ పత్రికలు యథాతథంగా అచ్చేసేవి. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు విధానాలకు తీవ్రమైన ప్రతిఘటన వ్యక్తమైన తర్వాత మాత్రమే ప్రపంచ బ్యాంకు విధానాలను ప్రశ్నిస్తూ వచ్చే కథనాలు అది కూడా కొన్ని పత్రికల్లో మాత్రమే అచ్చయిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది.



ఇంటర్నెట్ యుగంలో పారదర్శకత - మీడియా

గతంలో ప్రభుత్వ విధి విధానాలు తెలుసుకోవటం, అవి ఎవరికి ప్రయోజనం ఎవరికి నష్టం అన్న విషయాన్ని గుర్తించటం చాలా శ్రమతో కూడిన పని. వర్ధమాన దేశాల్లో మీడియా స్వభావానికి, సంపన్న దేశాల్లో మీడియా స్వభావానికి మధ్య మౌలికమైన వ్యత్యాసం ఉంది. ఏ దేశంలోనైనా మీడియా సంస్థలు ఆయా దేశ ప్రయోజనాల పరిధిలోనే వ్యవహరిస్తూ వచ్చాయి. వర్ధమాన దేశాల్లో దేశ విముక్తి కోసం జరుగుతున్న పోరాట నేపథ్యంలో మీడియా సాధనాలు నిర్దిష్ట రూపం తీసుకున్నాయి. అటువంటి వర్ధమాన దేశాల్లోనే ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించటంలో మీడియా ఎన్నో అవాంతరాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. భారతదేశంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రభుత్వానికి 70 దశకంలో జరిగిన వివాదాలు దేశంలో ప్రసారమాధ్యమాల స్వతంత్రతను కాపాడటంలో కీలక సాధనాలుగా మారాయి. ఈ పరిణామం అమెరికా వంటి దేశాల్లో 19వ శతాబ్దం చివర్లోనే పూర్తయ్యింది. పెట్టుబడిదారీ విధానంతో పాటే మీడియా, ప్రభుత్వం మధ్య సంబంధాల్లో కూడా పెద్దఎత్తున మార్పులు వచ్చాయి. 'జాతీయ ప్రయోజనాలు' అన్న ముసుగులో మీడియా సాధనాలు ప్రభుత్వాలను నిలదీయటం ఎప్పుడో మానేశాయి. మీడియా స్వయంప్రతిపత్తి పేరుతో ప్రభుత్వాలు కూడా మీడియా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం మానేసి మీడియా సంస్థల యజమానులకు కావాల్సినన్ని ప్రయోజనాలు చేకూర్చటం ద్వారా వాటి నోరు మూయించే స్థితి వచ్చింది. దానికి తోడు మీడియా సంస్థల యాజమాన్యం కొన్ని శక్తివంతమైన బహుళజాతి కంపెనీల చేతుల్లోకి మారిపోవటంతో ఒక్కో మీడియా ఒక్కో కంపెనీ ప్రయోజనాల పరిరక్షణకోసం పని చేయటం సంపన్న దేశాల్లో ప్రత్యేకించి అమెరికాలో సర్వసాధారణ అంశంగా మారింది. భారతదేశంలో ఈ పరిణామం ఇంకా అమెరికా స్థాయికి చేరుకోకపోయినా నీరా రాడియా టేపుల వివరాలు పరిశీలిస్తే ఈ క్రమం ప్రారంభమైందన్న విషయం రుజువు అవుతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఇంటర్నెట్, దాంతో వచ్చిన మార్పులు, తదనుగుణంగా ప్రభుత్వ పాలనలో కూడా మార్పులు వచ్చాయి. ప్రత్యేకించి 24 గంటలు వార్తలు ప్రసారం చేసే టీవీలు వచ్చాక వార్తలు ప్రజలకు చేరవేసే సాధనాల సామర్థ్యం పెరిగింది. అయినా ప్రధాన స్రవంతికి చెందిన వార్తా సంస్థలు కంపెనీలతోనో, పాలకపార్టీలతో ప్రత్యక్ష అనుబంధం కలిగి ఉండటంతో నిష్పాక్షికమైన వార్తలు ప్రజలకు చేరవేయటంలోనూ, వాస్తవాలు ప్రజలు ముందుంచటంలోనూ సమర్థవంతంగా పని చేయలేకపోతున్నాయి. ప్రత్యేకించి ఈ పరిణామం అమెరికాలో పతాక స్థాయికి చేరుకొంది. ఉగ్రవాదంపై పోరాటం పేరుతో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై అమెరికా సాగించిన దారుణ మారణకాండ సమయంలో అమెరికా మీడియా ఏకంగా పెంటగాన్ అధికార ప్రతినిధిగా వ్యవహరించటంతో ప్రధాన స్రవంతి మీడియా పట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లింది. ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ అమెరికాకు చెందిన ప్రముఖ వామపక్ష మేధావి జాన్ బెల్లమీ ఫాస్టర్ "సంక్షోభ సమయంలో ప్రజాతంత్ర మీడియా వ్యవస్థ ప్రతి ఘటనకు సంబంధించి విస్పష్టమైన వాస్తవికతను ప్రజల ముందుంచాలి. అధికారంలో ఉన్న వారి చర్యలను, నిర్ణయాలను నిరంతరం తరచి తరచి ప్రశ్నించాలి...దీనికి భిన్నంగా అమెరికాలో జర్నలిస్టు మేధావులు 9/11 నేపథ్యంలో జర్నలిస్టు ప్రమాణాలు పాటించటం వదిలేశారు" అని విమర్శిస్తాడు.

ఆఫ్రికా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి తేవటం ద్వారా పాశ్చాత్య ప్రభుత్వేతర సంస్థలు, మీడియాకు దగ్గరైంది. తర్వాతి దశలో ఇరాక్ యుద్ధం గురించిన వివరాలు వెల్లడించింది. ఈ వివరాల్లో కొత్తదనం ఏమీ లేకపోయినా తెరవెనుక జరిగిన పరిణామాలు, అమెరికా వివిధ దేశాలను ఏ విధంగా కట్టడి చేసి మరీ యుద్ధంలోకి దించిందన్న విషయాలు



తొలిసారిగా వెలుగు చూశాయి. యుద్ధ సమయంలో అమెరికా అనుసరించిన వికృత చేష్టలు, మానవహక్కుల ఉల్లంఘనలు, అబుగ్రాయిబ్ వంటి ఉదంతాలు మరికొన్ని ఉన్నాయన్న విషయాన్ని ఈ లీకులు స్పష్టం చేస్తున్నాయి. చివరిది దౌత్య రహస్యాలకు సంబంధించిన లీకులు. సాధారణంగా దౌత్యవేత్తలు, దౌత్య సిబ్బంది తమ మాతృదేశ ప్రయోజనాలకు అవసరమైన సమచారాన్ని సేకరించటానికి వివిధ పద్ధతులు అనుసరిస్తారు. ఈ సమాచారాన్ని నిర్దిష్టంగా రికార్డు చేయాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. ఈ రికార్డు చేయాల్సిన అవసరం, ఉన్నత అధికారులకు రిపోర్టు చేయాల్సిన అవసరం నేపథ్యంలోనే మొబైల్, కంప్యూటర్, ఇంటర్నెట్ వంటి సాధనాలను విరివిగా వాడతారు. ఒకసారి వీటిని హ్యాక్ చేస్తే అందులో ఉన్న సమాచారం వరదలా నలువైపులా ప్రవహిస్తుంది. వికీలీక్స్ చేసింది కూడా అదే. దేశాల వారీగా ఏయే సమాచారం వెలుగులోకి వచ్చిందన్న విషయాన్ని రోజువారి పత్రికలు కాస్తో కూస్తో రాస్తూనే ఉన్నాయి. విశేషమేమిటంటే ఈ సమాచారానికి, ఆదేశాలకు, వాటి అమలుకు అమెరికాయే కేంద్రంగా ఉంటోందన్న విషయాన్ని ఈ లీకులు ప్రపంచం ముందుంచాయి. వివిధ దేశాలు తీసుకునే విధాన నిర్ణయాల వెనక అమెరికా ఆదేశాలు, దాని ప్రయోజనాలు ఏ విధంగా ఇమిడి ఉంటున్నాయన్న విషయాన్ని తెలుసుకోవటానికి ఈ లీకులు అక్కరకొస్తాయి. ఇటువంటి విషయాలు రెండు మూడు దశాబ్దాల తర్వాత సదరు ప్రభుత్వాలే విడుదల చేస్తాయి. కాస్ట్రోపై ఎన్ని సార్లు హత్యాప్రయత్నం చేసిందన్న విషయాన్ని స్వయంగా సిఐఎ వెల్లడించింది. ఇందిరాగాంధీ పట్ల అమెరికా అవగాహనను కిసింజర్ పత్రాల ద్వారా అమెరికా ప్రభుత్వమే వెల్లడించింది. సదరు సమాచారం మూడు నాలుగు దశాబ్దాల తర్వాత వెలుగు చూస్తే దాన్ని విశ్లేషించి అంచనాకు వచ్చే పని పరిమిత సంఖ్యలో ఉన్న చరిత్రకారులు చేస్తారు. దీనికి భిన్నంగా వర్తమాన ప్రపంచం, వర్తమాన జీవితం, దేశాల వర్తమానం గురించిన వాస్తవాలు, రహస్యాలు, కథనాలు ఎప్పటికప్పుడు వెలుగు చూస్తే సదరు పరిణామాల పట్ల ప్రజలందరూ స్పందిచేందుకు అవకాశం ఉంటుంది. కనీసం ప్రజలు తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ విధంగా చూసుకున్నపుడు వికీలీక్స్ దౌత్య రహస్యాల వెల్లడి ద్వారా ప్రభుత్వాల గుట్టు రట్టు చేయటం విలక్షణ చర్య అని చెప్పక తప్పదు. తాజా వాస్తవాలు తాజాగా ప్రజలకు చేరిపోతే ప్రభుత్వాలు, పాలకుల తలరాతలు మారిపోతాయి. అందువల్లనే హిల్లరీ క్లింటన్ అంతగా గగ్గోలు పెడుతోంది.

-కొండూరి వీరయ్య

ఓ యామిని కథ

కథ

పొద్దున్నే వాచ్‌మెన్ చెప్పిన వార్త వినగానే షాక్. "యామిని చనిపోయింది మేడమ్. రాత్రే ఫినాయిల్ తాగిందిట. అంబులెన్సులో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు" ఆ వార్త సారాంశమిది.

"హు... ఈరోజేంటి యామిని మూడేళ్ల క్రితమే మరణించింది. ఆశలు అడుగంటి, బతుకుమీద తీపి చచ్చిపోయిన యామిని నిన్నటిదాకా ప్రాణమున్నా జీవంలేని శిల్పం. యామిని ఆకారం ఇకపై కనిపించదంతే" అనుకుంటూ లోపలికొచ్చాను.

విషయం తెలుసుకున్న ఆయన, "అదో ట్రాజెడీ... అంతే. ఆమె కథ ముగిసిపోయింది" అన్నారు. గుండె భారంగా మారింది.

ఈ అపార్ట్‌మెంట్లో ఫ్లాట్ తీసుకుంటున్నపుడు రామనాథంగారి కూతురిగా యామినిని తొలిసారిగా చూశాను. మంచి పొడగరి, తీర్చిదిద్దిన రూపం, మితభాషి, ఉన్నతవిద్య అందించిన ఆత్మవిశ్వాసం... ఆమెను చూడగానే సదభిప్రాయమే కలిగింది. వాళ్లు గ్రౌండ్‌ఫ్లోర్లో వుంటే మాది మూడో అంతస్తు.

ఇంట్లోకి మారాక విషయాలన్నీ మెల్లమెల్లగా తెలిశాయి. రామనాథం రిటైర్డ్ లెక్చరర్. ఇప్పుడు అపార్ట్‌మెంట్ ఉన్న స్థలం వారిది. అపార్ట్‌మెంటుకోసం ఇవ్వగా వారికి మూడు ఫ్లాట్లు వచ్చాయి. ఇద్దరు కొడుకులు బేవార్సుగా తిరగడం తప్ప బాధ్యత తెలీదు. ట్యూషన్లు చెప్పగా వచ్చే ఆదాయంతో రామనాథం ఇల్లు నడిపేవారు. డబ్బుకు కటకటా అవుతున్నా, ఎవరూ ఖర్చుల్లో వెనక్కు తగ్గరు. నోరెత్తితే ఇప్పుడే అమెరికానుండి దిగినవాళ్లలా అందరినోటా ఆశువుగా ఆంగ్లం దొర్లిపోతుంటుంది. అవసరాలకోసం రామనాథంగారు మూడు ఫ్లాట్లల్లో ఒకదాన్ని మాకు అమ్మారు. మరి ఆ సొమ్మును బ్యాంకులో వేసుకుని పొదుపుగా సంసారాన్ని ఈదుస్తున్నారా అంటే లేదు. వచ్చిన డబ్బులతో ఒక కారు, బైక్ కొనేశారు. 'హోమ్ డెలివరీ' సౌకర్యాన్ని వాళ్లు ఉపయోగించుకున్నంతగా మరెవరూ వినియోగించుకోరేమో! ఊ అంటే ఫోన్‌చేసి అన్నీ తెప్పించుకోవడమే! ఇంట్లో వండుకునేకన్నా హోటల్ తిండే ఎక్కువ. 'కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయిగా' అలాగే ఆ డబ్బులూ అయిపోయాయి. మెల్లగా కారు అమ్మేశారు కూడా! డబ్బు పోయినా కొడుకుల్లో పొగరు తగ్గలేదు. వారి ఖర్చుల్లో డాంబికమూ పోలేదు.

ఆ ఇంట్లో వారందరికీ నిలువెల్లా గీర్వాణమే. పెద్ద కొడుకు బైక్ లిఫ్టు ఎదురుగా ఆపడం... పక్కకు తీయమంటే మా ఇష్టమంటూ పోట్లాడటం. అది ఏ రేంజికెళ్లిపోయిందంటే... 'ఈ స్థలమంతా మాదే, ఈ అపార్ట్‌మెంటంతా మా సొంతం. ఏదో దయతల్చితే మీ తొమ్మిది వాటాలవాళ్లు అద్దెకుంటున్నారు'... అన్నట్లుండేది వాళ్ల యవ్వారమంతా! అక్కడ వుండేదంతా ఓనర్లే! ఎవరూ వారిని లెక్కజేసేవాళ్లే కాదు. ఇదికాక 'అపార్ట్‌మెంట్ పైన వున్న ఖాళీ ప్రదేశం మాది. అక్కడ మేం ఏమైనా చేసుకోవచ్చు అనే కొత్త వాదన తీసుకొచ్చారు. వన్ ఫైన్ మార్నింగ్ లిఫ్టులో ఇటుకలు, ఇసుక మోసేశారు కూడా! వెంటనే తక్కినవారంతా అప్రమత్తమై దానిని ఆపేశారు. మరోసారి కింద పార్కింగ్ ప్లేస్‌లో షాపులు కట్టడానికి రెడీ అయిపోయారు. ఎంత అడ్డుకుంటున్నా కొడుకుల వీరంగం అలాగే వుండేది. తండ్రి సమర్థింపూ అలాగే వుండేది.

కొన్నాళ్లకి యామినికి రాజమండ్రిలో ప్రభుత్వోద్యోగం వచ్చిందనీ, ఐదంకెల జీతమనీ తెలిసి చాలా సంతోషం అనిపించింది. 'పోన్లే ఆ పిల్లన్నా ఈ కిష్కింధకాండకు దూరంగా స్థిమితంగా జీవితం గడుపుతుంది' అనుకున్నాను. అప్పుడప్పుడూ సెలవులకు వచ్చిపోతూ కనిపించేది. పలకరిస్తే నవ్వుతూ మాట్లాడేది. ఇదిలా వుండగా పెద్ద కొడుకు ఆ ఇంట్లో ఉన్నట్లుండి ఓ బాంబు పేల్చాడు. చాలాకాలం క్రితమే పెళ్లిచేసుకున్నానంటూ నడుస్తున్న కొడుకును, నిండు గర్భిణీగా వున్న భార్యను సరాసరి ఇంటికి తీసుకొచ్చేశాడు. అప్పటికి అతను జీవితంలో స్థిరపడింది లేదు. పైసా సంపాదిస్తోంది లేదు. అతని సంసారాన్ని భార్య నడిపేదట. గర్భిణీ కావడంతో ఉద్యోగం మానేసిందిట. సో, ఇంటద్దె కట్టలేక, ఇల్లు గడపలేక ఏదైతే అదైందని కుటుంబాన్ని తీసుకుని వచ్చేశాడు. ఇలాంటివన్నీ చాకచక్యంగా నిర్వర్తించే తెలివి రామనాథంగారికుంటే ఈ తిప్పలన్నీ ఎందుకు? ఇక మిగిలింది రెండో ఫ్లాటు అమ్మకం. క్షణాల్లో అదీ జరిగిపోయింది. తినడం, తిరగడం, నిద్రపోవడం... ఆ ఇంట్లో అందరి షెడ్యూలూ ఇదే! క్రమంగా రెండో ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బులూ ఆవిరైపోయాయి. ఇక మిగిలిన ఆధారం యామిని.

రాజమండ్రి నుండి నెలనెలా యామిని డబ్బులు పంపిస్తేనే ఇక్కడ ఇల్లు గడిచేది. అప్పుడప్పుడు యామిని తల్లి కనపడి, 'పిల్లకసలు వండుకునే టైమే లేదట. చిక్కిపోయింది' అని చెప్పింది. 'అదీ నిజమేగా. ఉద్యోగంలో ఉరుకుపరుగులతో ఈకాలం పిల్లలు కడుపునిండా ఎక్కడ తింటున్నారు?' అనిపించేది. ఇలా రోజులు గడుస్తుండగా ఉన్నట్లుండి ఓరోజు యామిని కనిపించింది... అదీ ఆఫీసుకు వెళుతున్నట్లుగా!

'యామినీ, ట్రాన్స్‌ఫర్ అయ్యిందా?' అడిగితే, 'కాదండీ, ఆ ఉద్యోగం మానిపించి నాన్నగారు ఇక్కడో ఉద్యోగం చూశారు. ఇదీ పర్మినెంట్ అవుతుందిట' అంటూ చెప్పింది. మామూలుగానైతే, 'పోన్లే ఎదిగిన పిల్ల తల్లిదండ్రుల వద్ద వుంటుంది. ఆఫీసులో అలిసిపోయినా టైముకు కాస్తంత తిని రెస్టు తీసుకుంటుంది' అనుకోవాలి. కానీ నాకలా అనిపించలేదు. మనసులో ఇదీ అని చెప్పలేని భావం కలిగింది. 'ఏదో కష్టపడ్డా తనవరకూ వుండి, తిని ప్రశాంతంగా బతుకుతోంది. ఇప్పుడిక్కడ ఈమెను ఎవరు ప్రశాంతంగా వుండనిస్తారు?' అనిపించింది.

కొన్నాళ్లకు యామినికి సంబంధాలు చూస్తున్నారని తెలిసి, 'అమ్మయ్య, ఆ పిల్లకో దారి ఏర్పడుతోంది' అని సంతోషపడ్డాను. కానీ ఆ సంతోషం ఎన్నాళ్లో నిలవలేదు. ఇంటిల్లిపాదికీ బాగోగులు చూసే అమ్మాయి పెళ్లి చేసుకుని వెళ్లిపోతే ఇంకేమన్నా వుందా? కారణాలేమైనా యామినికి ఒక్క సంబంధమూ కుదర్లేదు. ఇప్పుడు యామిని పెద్దన్నకు ఇద్దరు పిల్లలు. పైసా ఇంటికి తీసుకురాడు. టైముకు తినడం, ప్రపంచాన్ని ఉద్ధరించేవాడిలా దున్నపోతులాంటి బండిమీద ఊరంతా బలాదూరు తిరగడం... ఇదే అతని నిత్యకృత్యం! సహనం కోల్పోయిన యామిని ఓరోజు పెద్దన్నమీద పోట్లాడింది. అంతే పౌరుషం పొడుచుకొచ్చిన అతగాడు పెళ్లాం పిల్లలను తీసుకుని వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అదే కోపంతో తమ్ముడినీ తిట్టింది యామిని. అప్పటికే ఆ అబ్బాయికి కొద్దిగా బాధ్యత తెలిసొస్తోంది. ఏ ఉద్యోగం చూసుకున్నాడో కానీ, కొద్దిరోజుల్లోనే అమెరికా వెళ్లిపోయాడా కుర్రాడు.

కానీ యామినికి పెళ్లి కుదర్లేదు. ఇంటిని నడిపే బాధ్యతా తీరలేదు. యామినికి మెల్లమెల్లగా చేస్తున్న ఉద్యోగంమీద శ్రద్ధ తగ్గింది. మొక్కుబడిగా ఆఫీసుకు వెళ్లడం, రావడం. నడకలో, మాటలో ఏదో నిర్లిప్తత. ఇంతలో అనుకోకుండా యామిని ఉద్యోగం పోయింది. అనవసరంగా ప్రభుత్వోద్యోగం

పోగొట్టుకున్నాననే దిగులు యామినిలో వుండేది. పొద్దస్తమానూ అదే ఆలోచించుకుంటూ కూర్చునేది. దిగాలుగా కనిపించే యామినితో, 'ఒక ఉద్యోగం పోయిందని ఇంట్లోనే వుండిపోతే ఎలా యామినీ? నీ చదువుకు మరో మంచి ఉద్యోగం దొరుకుతుంది. ఖాళీగా వుండకుండా ముందేదైనా ఉద్యోగంలో చేరిపో' అంటే మౌనం తప్ప సమాధానం వుండేది కాదు. ఎప్పుడన్నా కలిస్తే, 'నాకు పెళ్లి చేసుకోవాలని వుంది. మా నాన్న ఏ సంబంధమూ కుదరనివ్వడంలేదు' అని చెప్పి బాధపడేది. నిండు ఆరోగ్యంతో వుండే యామిని బక్కచిక్కిపోయింది.

మరి కొన్నాళ్లకు, 'నాకు కలలొస్తున్నాయి తెల్సా! ఎవరో నన్ను పెళ్లి చేసుకోమని పదేపదే అడుగుతున్నారు' అంటూ వెర్రినవ్వు నవ్వేది. ఆ తర్వాత, 'నా గదిలోకి ఒక మనిషొస్తున్నాడు. నన్ను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడు' అన్న యామిని మాటలు బిల్డింగులోని వారికి భయం కలిగించాయి. యామిని మాటలు మావారితో చెప్పాను.

ఆయన వెంటనే రామనాథం గారిని పిలిపించారు. ఆయన రామనాథంగారితో మాట్లాడటం ఇది మొదటిసారి కాదు. అప్పటికే చాలాసార్లు జరిగింది. కలిసిన ప్రతిసారీ, 'పిల్లలను పెంచాల్సిన పద్ధతి ఇది కాదు. వారికి బాధ్యత తెలియజేయాల్సిన బాధ్యత మీదే. ఇలా ఇళ్లమ్ముకుంటూ ఖర్చులు వెళ్లమార్చడం మంచి పద్ధతి కాదు. కూతురి సంపాదనపై ఆధారపడి మీరే కాకుండా, ఎదిగిన కొడుకులు బతకడమేంటి'... అంటూ సుతిమెత్తగా చెప్పేవారు. ఆ మాటలకు మరో మనిషైతే మారేవాడు. కానీ ఈయన బాధ్యతల నుండి తప్పించుకు తిరిగే రకం. ఇక ఆలోచించడం ఎప్పుడూ? మారేదెన్నడూ? ఇప్పుడొచ్చిన రామనాథంగారితో, 'సంబంధాలు వస్తున్నప్పుడు యామినికి ఎందుకు పెళ్లిచేయడం లేదు? ఇప్పటికైనా వాస్తవంలోకి రండి. వెంటనే యామిని పెళ్లి కానియ్యండి. లేకుంటే యామిని డిప్రెషన్‌కు వెళ్లిపోవచ్చు. ఇప్పటికే ఆమె మానసిక స్థితిలో మార్పు కనిపిస్తోంది' అని మెల్లగా నచ్చచెప్పారు. ఎప్పటిలాగానే రామనాథంగారు, 'తప్పకుండానండీ! నేనూ అదే అనుకుంటున్నాను' అని సమాధానం చెప్పారు.

కానీ ఆ ఇంట్లో ఎలాంటి మార్పూ లేదు. మారిందల్లా యామినే. ఆమె ప్రవర్తనలో విపరీతమైన మార్పొచ్చింది. ఎప్పుడూ మెట్లపైనే కూర్చునేది. లిఫ్ట్‌లో వచ్చే పోయే జనాలవంక గుర్రుగా చూసేది. లేదంటే పిచ్చినవ్వు నవ్వేది. తనలో తానే గట్టిగా మాట్లాడుకోవడం, కనిపించిన వాళ్లపై అకారణంగా పోట్లాడటం. 'ఇదేంటి, యామినికి వైద్యం చేయిస్తున్నారా లేదా?' అని అడిగితే ఇంట్లో వాళ్ల సమాధానం, 'ఫలానా బాబా దగ్గరకు తీసుకెళ్లాం. మాంఛి తాయెత్తు కట్టించాం. త్వరలోనే నయమైపోతుందిట'! మంత్రాలకు చింతకాయలు రాలితే ఇన్ని ఆసుపత్రులెందుకు? ఏం బుద్ధిపుట్టిందో ఓరోజు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వాళ్లు కొన్నిరోజులు ఇక్కడే వుంచాలన్నారట. ఆసుపత్రిలో చేర్పించారని తెలిసి పోన్లే పిల్లకు నయమైపోతుందని బిల్డింగులో అందరూ అనుకున్నారు. కానీ అదీ మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. 'ఆసుపత్రిలో యామిని ఎలాగుంది?' అన్న ప్రశ్నకు ఆమె తండ్రినుండి విచిత్రమైన సమాధానం వచ్చింది. యామిని కోసం ఓ గది అద్దెకు తీసుకుని అందులో ఆమెను వుంచారట. 'ఇదేం అన్యాయం? ఒక్కర్తే ఆ గదిలో ఎలా వుంటుంది? అసలే మానసికస్థితి బాలేదు. ఏ పనీ సవ్యంగా చేసుకోలేదు. ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే?' గుండె జల్లుమంది. 'అది కాదు కదండీ పద్ధతి? అక్కడ తనెంత ఇబ్బంది పడుతుందో ఏమో' అన్న మాటలకు రామనాథం నోటివెంట సమాధానమే లేదు.

నెలరోజులు కాకముందే యామినిని ఇంటికి తీసుకొచ్చేశారు. ఆ గది ఓనర్లు ఇల్లంతా ఆగం చేస్తోందని ఇల్లు ఖాళీ చేయమన్నారట. పోనీ, ఇంటికి తీసుకొచ్చాకనైనా యామిని బాగోగులు శ్రద్ధగా చూసుకుంటున్నారా అంటే అదీ లేదు. ఇక యామిని చేష్టలు చెప్పనలవి కాదు. వండిన అన్నం, కూరలు బాల్కనీలోంచి రోడ్డుమీదకు విసిరేసేది. పొరపాటున రోడ్డుమీద ఎవరిమీదనైనా పడినా పట్టించుకునేది కాదు. పొయ్యి వెలిగించి అలాగే వుంచేసేది. ఉన్నట్లుండి కిచెన్ గడియ వేసుకుని లోపలే వుండిపోయేది. కిచెన్లోనుంచి యామినిని బైటికి తీసుకురావడం ఒక పెద్ద ప్రయాస. పంపులన్నీ తిప్పేసి నీళ్లపోతుంటే చూస్తూ కూర్చునేది. ఇదీకాకుంటే ఒక కర్ర తీసుకుని లిఫ్టు దగ్గర కూర్చుని అందరిమీద కలబడేది. లేదంటే మౌనంగా చూస్తూ కూర్చునేది. ఇక పిల్లలకు బైటకు వెళ్లాలంటే ఏ నిముషంలో యామిని మీదపడుతుందోనని ఒకటే భయం.

అంతలోనే మరో మార్పు. యామిని అసలు గదిలోంచి బైటకు రావడమే మానేసింది. ఆఖరికి తల్లిదండ్రులతో కూడా మాట్లాడేది కాదు. తన వంట తానే వండుకునేది. తన బట్టలు తానే ఉతుక్కునేది. తన గదిని తుడుచుకుని మురికినీళ్లన్నీ హాల్లో పడబోసేది. ఆ గదిలోకి తల్లిదండ్రులకు కూడా పర్మిషన్ లేదు. వండుకోవడానికి సరుకులుసైతం వాళ్లివ్వకూడదు. వాళ్లేమైనా విషం కలిపిస్తే... ఇంకేమైనా వుందా అనే భయం. డబ్బులు మాత్రం తీసుకునేది. ఆ డబ్బులతో వాచ్‌మెన్‌ను పిలిచి ఫలానా సరుకు తెమ్మనేది. వెంటనే తలుపు వేసేసుకునేది. యామిని మదినిండా అభద్రతాభావం, అందరిపైనా అనుమానం. ప్రతి ఒక్కరూ తనను ఏదో చేయడానికే చూస్తున్నారనే భ్రమలు. ఇలా ఆ గదిలో తనకు తానే బందీగా యామిని రెండేళ్లపైనే వుంది. తనకు తానే శిక్ష విధించుకుని ఒంటరితనంలో మగ్గిపోయింది. ఆ అమ్మాయిని చూసి జాలిపడటం తప్ప ఎవరూ ఏ సాయమూ చేయలేని పరిస్థితి.

అలాంటి యామిని మళ్లీ ఈ నెలనుంచే బైట కనిపిస్తోంది. తానే స్వయంగా వచ్చి కూరగాయలు కొనుక్కుంటోంది. రోడ్డు చివరి దుకాణానికెళ్లి బ్రెడ్, సరుకులు తెచ్చుకుంటోంది. యామిని ఆనాటి యామిని కాదు. ఇప్పుడు ఆమె ఒక నడిచే శవం... జీవచ్ఛవం... ఓ ఎముకలపోగు. లోతుగా గుంటలుపడిన ఆ కళ్లల్లో ఏ ఆలోచనలున్నాయో... చూసే అవకాశం ఎదుటివారికి ఇవ్వదు. అసలు చూపు కలపదు. మాట ఊసే లేదు. ఎదురైతే నవ్వితే మనమెవరమో తెలీనట్లే వెళ్లిపోతుంది. 'ఏమైతేనేం, బైటికొస్తోంది. అంటే కాస్త మనుషుల్లో పడ్డోంది. మెల్లగా కుదుటపడి మామూలు మనిషైతే అంతే చాలు' అనుకున్నామంతా!

అంతలోకే ఈ వార్త. ఎలాంటి పిల్ల ఎలా అయిపోయింది? అంతలేసి చదువులు చదివింది. బంగారంలాంటి ఉద్యోగం చేసేది. సరైన సమయంలో పెళ్లిచేస్తే ఆమె జీవితం ఎలాగుండేదో? పెళ్లి చేసుకోవాలనీ... సంతోషంగా గడపాలనీ ఎన్ని కలలు కనిందో? ఎంతగా తండ్రిని ప్రాధేయపడిందో? ఆ పిల్ల జీవితం ఇలా నాశనమైపోవడానికి ఎవరు కారణం? బాధ్యత తెలియని అన్నదమ్ములా? వచ్చిన డబ్బులు వచ్చినట్లుగా ఖర్చుచేస్తూ కాలం వెళ్లబుచ్చిన కుటుంబసభ్యులా? కుటుంబ బాధ్యతలు చక్కదిద్దడంలో విఫలమైన రామనాథమా? ఇంటి కష్టాలన్నీ గాలికొదిలి పూజాపునస్కారాలతో కాలం వెళ్లబుచ్చే రామనాథం భార్యదా? వీళ్లు మారరని తెలిసీ, తన దారి తాను చూసుకోని యామినిదా?

'ప్రపంచంలోని అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాలే' అన్న మార్క్స్‌మాట ఎంత నిజం? యామిని తల్లిదండ్రులుగానీ, అన్నదమ్ములుగానీ యామిని మనసు పట్టించుకోలేదు. ఆమెకూ ఆశలుంటాయనీ, ఆమెకూ కోరికలుంటాయనీ ఎవరూ అనుకోలేదు. ఎంతసేపూ తమ సుఖం, లాభం బేరీజు వేసుకున్నారు తప్ప ఆమె జీవితం గురించి ఎవరూ ఆలోచించలేదు.

అటు వయసు తెచ్చే ఆశలు, ఇటు వదిలించుకోలేని బాధ్యతల నడుమ యామిని ఎంత నలిగిపోయిందో? తన మనసులో సుడిరేగే ఆలోచనలను ఎవరితోనూ పంచుకోలేక... లోలోపలే అణచుకోలేక యామిని మూగగా ఎంత క్షోభపడిందో? ఆక్రోశాన్ని బైటికి వెళ్లగక్కలేక... అలాగని సర్దుకుపోలేక సతమతమైన ఆ ఎదలో రేగిన తుఫాను ఫలితం ఇదేనా?! ఈ జీవితం ఇక ఇంతే అన్న విరక్తి, నిర్వేదాల మాటున యామిని తీసుకున్న నిర్ణయం చివరికి ఇదా? బతికీ అనవసరం అని ఎంత తీవ్రంగా అనుకుని యామిని ఈలోకంనుండి సెలవు తీసుకుందో? అలజడినుండి విముక్తికి ఆత్మహత్యను మించిన మార్గం యామినికి కనిపించలేదా?

శాశ్వతనిద్రలో వున్న యామినిని ఆఖరిచూపు చూస్తూ చిన్న కన్నీటి చుక్క రాల్చడం తప్ప ఏమీ చేయలేకపోయాను. చచ్చి సుఖపడిందేమో అనుకోవడం తప్ప మరేమీ ఆలోచించలేకపోయాను.

- కె. అరుణ

★



దాల్ మస్కా

కావాల్సిన పదార్థాలు:

రాజ్మా: 100 గ్రా, మినుములు: 50 గ్రా, టమాటా సాస్: 4 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు: 100 గ్రా, నూనె: 50 గ్రా, అల్లం వెల్లుల్లి : 2 టేబుల్ స్పూన్లు, కారం: టీ స్పూను, పసుపు: చిటికెడు, గరంమసాలా: చిటికెడు, జీడిపప్పు: టేబుల్ స్పూను, గసగసాలు: టేబుల్‌స్పూను, ఆరెంజ్ కలర్: పావు టీస్పూను, ఉప్పు: తగినంత, కొత్తిమీర: కట్ట, వెన్న: ఒకటిన్నర టేబుల్ స్పూను

తయారుచేసే విధానం:

ఎర్రని రాజ్మాలనీ మినుములనీ బాగా కడగాలి. ఈ రెండింటినీ కలిపి 3 గంటలు నానబెట్టాలి. తర్వాత వీటిలో చిన్న అల్లంముక్క వేసి తగినంత ఉప్పు వేసి కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. జీడిపప్పు, గసగసాలు కలిపి ముద్దగా నూరాలి. బాణలిలో నూనె వేసి స్టవ్ మీద పెట్టాలి. అందులోనే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కల్ని వేసి దోరగా వేయించాలి. తర్వాత అల్లం-వెల్లుల్లి, కారం పసుపు వేసి వేయించాలి. వేగిన తర్వాత టమాటా సాస్ వేసి కలిపితే ఎర్రని గ్రేవీ రెడీ. ఇందులో ఉడికించిన రాజ్మా మినుములూ వేసి గరిటెతో బాగా కలపాలి. తర్వాత గరం మసాలా, జీడిపప్పు ముద్ద వేసి కలిపి ఉప్పు రుచి చూసి దించుకోవాలి.

రెడ్‌బీన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు:

రాజ్మా: 100 గ్రా, టమాటా : 2, ఉప్పు: తగినంత
పచ్చిమిర్చి :4, ఉల్లిపాయలు: 100 గ్రా, పసుపు: చిటికెడు
కారం : 2 స్పూన్లు, ధనియాలపొడి : 1స్పూను
గరం మసాలా : 1 స్పూను, నూనె :1 టీస్పూను

తయారుచేసే విధానం:

పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇవి వేగాక ఉల్లి, టమాటా ముక్కలు వేసి ఉడికించాలి. ఉడికించిన రాజ్మా, కారం, ధనియాల పొడి, గరంమసాలా వేసి కలపాలి. మంట తగ్గించి గ్రేవీ చిక్కబడేవరకూ ఉడికించి దించాలి. దించేముందు కొత్తిమీర చల్లాలి. ఇది చపాతీ, అన్నం రెండింటిలోకి బాగుంటుంది.



రాజ్మా విందులు



చీజ్ టోస్ట్

కావాల్సిన పదార్థాలు

రాజ్మా : 150 గ్రా, టమాటా సాస్: ఒకటిన్నర కప్పులు, చీజ్: 50 గ్రా, బ్రెడ్ ముక్కలు: 10

తయారుచేసే విధానం:

రాజ్మాను మెత్తగా ఉడికించి వుంచాలి. ఓ గిన్నెలో నూనె పోసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కల్ని వేసి వేయించాలి. తర్వాత కొంచెం కారం, టమాటా సాస్ కలపాలి. ఇందులోనే ఉడికించిన రాజ్మాలను కూడా కలపాలి. చీజ్‌ను కొబ్బరిలా తురమాలి. రాజ్మా మిశ్రమాన్ని బ్రెడ్‌మీద మొత్తం పరచుకునేలా పెట్టాలి. దీనిమీద చీజ్ తురుము చల్లి ఓవెన్‌లో గ్రిల్‌లో సుమారు ఓ పది నిమిషాలు అంటే చీజ్ కరిగి గింజల మిశ్రమానికి పట్టేవరకూ వుంచి తీస్తే టోస్ట్ రెడీ. ఇది పిల్లలకు మంచి పోషకాహారం. రాజ్మాలకు బదులుగా పెసలు, అలసందలు (మొలకలు వచ్చినవైనా) వేసుకొని కూడా చేసుకోవచ్చు.

(ఉడికించిన రాజ్మా బేక్‌డ్ బీన్స్ రూపంలో సూపర్‌మార్కెట్లలో దొరుకుతున్నాయి. ఈ టిన్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకొని ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు.)



కిడ్నీ బీన్ సలాడ్

కావాల్సిన పదార్థాలు

రాజ్మా: కప్పు, వెల్లుల్లి: 4 రెబ్బలు
నూనె: ఒకటిన్నర టేబుల్ స్పూన్లు
టమాటాలు: 100 గ్రాములు
క్యాబేజీ: 100 గ్రా, పచ్చిమిర్చి: 2
ఉల్లిపాయలు: 50 గ్రా
ఉప్పు: తగినంత, నిమ్మరసం: టీ స్పూను.

తయారుచేసే విధానం:

రాజ్మాను 3 గంటలు నానబెట్టి కుక్కర్‌లో ఉడికించాలి. టమాటాలను 4 ముక్కలుగా కోయాలి. క్యాబేజీ, ఉల్లిపాయలు కూడా ఒకటిన్నర అంగుళాల సైజులో ముక్కలుగా కోసి పక్కనబెట్టాలి. ఓ బాణలిలో నూనె పోసి వెల్లుల్లి ముక్కలు ఎర్రగా వేయించాలి. తర్వాత కూరగాయ ముక్కలన్నీ వేసి బాగా కలియబెట్టాలి. తర్వాత ఉడికించిన రాజ్మా కూడా వేసి కలపాలి. తగినంత ఉప్పు, నిమ్మరసం కూడా కలిపి వేడిగా వడ్డించాలి.

సదా జ్వలింపజేసే ఆశయదీప్తి

ఫ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్ (కావ్యం) -మయకోవస్కి రచనకు అనువాదం శ్రీశ్రీ , ప్రజాశక్తి బుక్‌హౌస్, ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం.'1/1, ఆజమాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,హైదరాబాద్-20, వెల: 30 రూ.

లెనిన్‌పై మయకోవస్కీ రాసిన కావ్యానికి శ్రీశ్రీ తెలుగు అనువాదం ఇది. మయకోవస్కీపై బ్లాక్, పుస్కిన్ రచనల ప్రభావం వుండేది. 1913లో కవితారంగంలో అడుగు పెట్టినప్పుడు తొలి గీతాలతో వెనుకటి కవులను అవహేళన చేసే తెంపరితనమూ వుండేది. 'నాకు తెలుసు-నా చెప్పులో ఓ మేకు గుచ్చుకుంటోంది. అది గెథే భావనా శక్తికన్న భయంకరమైనది' లాంటి భావాలు వ్యక్తపరిచాడు. అక్టోబర్ సోషలిస్టు విప్లవం తొలి రోజు 1917 అక్టోబర్ 26న స్మోల్నీకి వెళ్ళి లెనిన్‌ను దర్శించడంతోనే సోషలిజం వైపు తిరుగులేని ముందడుగు వేసే అక్షరయోధుడైన కవిగా అతనిని మార్చివేశాయి. లెనిన్‌పై మయకోవస్కీ రాసిన కావ్యాన్ని శ్రీశ్రీ తెలుగులో అనువదించాడు. ఈ అనువాదంలో మహాప్రస్థానంలోని ఉరకల గతులు కనిపించవు కానీ లెనిన్ మూర్తిమత్వాన్ని కళ్లకు కట్టేలా దర్శించగలుగుతాం. "ఒకసారి నేనతన్ని చూశాను /ఒక మనిషిని చూడటం/ సూటయిన గురితో/ రేజరు వంటి వాడిలో/ పట్టుకారులాగ సారాంశాన్ని పట్టి పైకెత్తి / మాటల చాటున దాగిన ఆత్మని / వెలికి తియ్యడం చూశాను/ నాకు తెలుసు/ అతని సమక్షంలో అన్నీ బయటపడతాయి/ అన్నీ అర్థమవుతాయి / గాలించే అతని కనుచూపును / తప్పించుకునేదేదీలేదు / ఓడ కళాసి, గని పని మనిషీ / ఎక్కడ నిలుచున్నారో/ కర్షకుడూ సైనికుడూ/ దేనికోసం ఎదురు చూస్తున్నారో/ అంతా అతనికి సుస్పష్టం/ సమస్త జాతుల్నీ తన నేత్రాలలో ఇముడ్చుకున్నాడు/ రవి ఉదయించే, అస్తమించే/ ఖండఖండాంతరాలతో సహా..." అంటూ లెనిన్ నేతృత్వ ప్రభావాన్ని బలీయంగా అభివ్యక్తం చేయడం కన్పిస్తుంది. "ఇదే అదను లెనిన్ కథను రచించెదను నేను-లెనిన్ బ్రదుకు జనం కొరకు ధ్వనించెదను నేడు-లెనిన్ కథాక్రమం సదా జపించితిని నేను- విషాదాశ్రు తుషారాల నిషా నాకు లేదు. లెనిన్ నేడు లేడూ? చూడు జనంతో ఉన్నాడు" అంటూ మయకోవస్కీ సంభాషించిన సోషలిస్టు జన నేత లెనిన్ కథనాన్ని శ్రీశ్రీ పీడితజన సేనానివహం అఖండశక్తితో లేచిరావాలన్న ఆశయదీప్తితో ఈ అనువాదాన్ని సంతరించాడు. కాలం మరుగున పడిన వారనుకుంటాంగానీ గుండెల్లో సదా సదాశయదీప్తిని జ్వలింపచేస్తూనే వుండే జననేతలు కొందరు. లెనిన్ కావ్యం ఆ దృష్ట్యా స్ఫూర్తిదాయకమైంది.

కొత్త పుస్తకాలు

యువతకు మంచి కానుక

తెలుగుసామెతలు (ఇంగ్లీషు అనువాదం, వ్యాఖ్యానంతో) కెప్టెన్. ఎం. డబ్ల్యు. కార్, ప్రజాశక్తి బుక్‌హౌస్, 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-20, వెల: 100/-.



'ఆంధ్ర లోకోక్తి చంద్రిక' పేరిట నూటనలభై ఏళ్లక్రితం నాటి అపురూప గ్రంథాన్ని-తెలుగు సామెతలు ఇంగ్లీషు అనువాదం, వ్యాఖ్యానంతో కెప్టెన్ ఎం.డబ్ల్యు.కార్ ఎ కలక్షన్ ఆఫ్ తెలుగు ప్రావర్బ్స్ ట్రాన్స్‌లేటెడ్ అండ్ ఎక్స్‌ప్లైన్‌డ్‌గా కూర్చిన దానిని ఈ తరానికి ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించి అందిస్తోంది. తెలుగు సామెతలకు సమానార్థకమైన ఇంగ్లీషు సామెతలు, తెలుగు సామెతలకు ఆంగ్లంలో వివరణ ఇవ్వడానికి 'కార్' కృషి చేశారు. ప్రచురణకర్తలు 'ముందుమాట'లో అన్నట్లు నేటి ప్రమాణాలతో, మర్యాదలతో చూసినప్పుడు ఇందులోని కొన్ని సామెతలు ఎబ్బెట్టుగానో, ఇబ్బందిగానో అనిపించవచ్చు. ముఖ్యంగా స్త్రీలను, కొన్ని సామాజిక తరగతుల వారిని కించపరిచే ధోరణి వాటిలో ప్రస్ఫుటంగా వుంటుంది. అదే స్థాయి కింది తరగతులవారి బాధావేదనలు కూడా ధ్వనిస్తాయి. ఇవన్నీ కూడా సమాజ పరిణామాన్ని అర్థంచేసుకునే కోణం నుండి అధ్యయనం చేయడం అవసరం. సంస్కృత సామెతలను మాత్రం ఇందులో చేర్చలేదు. తెలుగు వర్ణమాల అకారాదిక్రమంలో మొత్తం రెండు వేల నూట ఇరవై తొమ్మిది తెలుగు సామెతలు వాటి ఇంగ్లీషు అనువాదం వ్యాఖ్యానంతో ఈ గ్రంథంలో మనం అందుకోగలం. ఇంగ్లీషు మాధ్యమంలో చదవక తప్పని ఈ తరం విద్యార్థులకు తెలుగు భాషలోని, ముఖ్యంగా సామెతలలోని అందాలనూ, సారాన్నీ అందించేందుకూ, అలాగే ఇతర భాషీయులకు కూడా ఆంగ్లం ద్వారా తెలుగు సామెతల సొబగులను పరిచయం చేసేందుకు ఎంతగానో ఉపయుక్తమయ్యే గ్రంథం ఇది. ఒక మంచి కానుకగా యువతకు అందించదగినది.

జ్ఞాపకాల చిరుగ్రంథం

శ్రీశ్రీ దిగంబర కవులు-విరసం -నిఖిలేశ్వర్, 2-2-647/185/1ఎ, శారదానగర్, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్-13.



శ్రీశ్రీ శతజయంతి ముగింపు సందర్భంగా శ్రీశ్రీ దిగంబర కవులు, విరసం, అనే ఒక లేఖల రూపంలోని జ్ఞాపకాల చిరుగ్రంథాన్ని నిఖిలేశ్వర్ వెలువరించారు. 1968-75 మధ్య తెలుగు సాహిత్య పరిణామాల చారిత్రక అధ్యయనానికి శ్రీశ్రీ నిర్వహించిన పాత్ర గురించి తెలుసుకోవడానికి ఆసక్తి గల పాఠకులు ఓ మారు తొంగిచూడదగిన పుస్తకం ఇది. ఇది నిఖిలేశ్వర్‌కు శ్రీశ్రీకి నడుమ వ్యవహారం అని అనుకోకూడదు. దిగంబర కవులకు ప్రతినిధిగానే నిఖిలేశ్వర్‌కు, అలాగే విరసం సంస్థాగత సందర్భాల్లోనూ శ్రీశ్రీ నిఖిలేశ్వర్‌కు రాసిన ఉత్తరాలు కొన్ని ఇందులో జతపరుస్తూ నిఖిలేశ్వర్ వివరించిన రచన ఇది. ఒక గొప్ప వ్యక్తిని ఆరాధనాతత్వంతో కాకుండా, ఆ వ్యక్తిలోని చీకటి వెలుగులని నిర్మొగమాటంగా దర్శించాలనీ, ఏనాటికైనా విప్లవ శక్తుల ఐక్యత చారిత్రక అవసరమని ప్రగాఢంగా విశ్వసిస్తున్న వాళ్ళు ప్రస్తుతం వున్న స్నేహపూరిత వైరుధ్యాల అడ్డుగోడలను కూల్చి 'కష్ట జీవికి రెండు వైపులా నిలిచేవాడే నిజమైన రచయిత" (కవి అని కదా!) (శ్రీశ్రీ) అనే మౌలిక అంశాన్ని, కర్తవ్యాన్ని ఈ తరం రచయితలంతా నిర్వహించాలనే తపనతో వున్నవాళ్ళలో ఒకడిగా ఇవన్నీ పంచుకోవడం" అంటారు నిఖిలేశ్వర్. కల్లోలసంధ్యలో మహాకవి సంఘర్షణను తన కోణంలో నిఖిలేశ్వర్ ఇందులో వ్యక్తీకరించారు. ఈ ప్రచురణ శ్రీశ్రీ సాహిత్య-రాజకీయాల పరంగా సరైన అంచనాకు పునర్మూల్యాంకనకు ఉపకరిస్తాయని రచయిత నమ్ముతున్నారు.

సుధామ

పది పదాలు గుర్తించండి

హల్లో... క్రిస్టమస్‌కి సంబంధించిన పదాలు పది ఇక్కడ బొమ్మలో వున్నాయి. వాటిని గుర్తించాల్సింది మాత్రం మీరే. అడ్డంగానో, నిలువుగానో, క్రాస్‌గానో ఎలాగైనా సరే అవి వుండొచ్చు.
మరి రెడీనా!

చెట్టులో దాగినే...

హాయ్ బుజ్జాయిలూ... ఇక్కడ ఓ పేద్ద వృక్షం వుందర్రా. చూశారుగా... అందులో కొన్ని జంతువులు, తినుబండారాలు, వస్తువులు, నిర్మాణాలు దాగివున్నాయి. మరి అవేంటో కనిపెట్టి రంగులు అద్దేస్తే పోతుందికదా. ముందు వాటి చుట్టూ సున్నా చుట్టండి. తర్వాత రంగుల పని పట్టండి

చుక్కలు కలిపేస్తే పోలా

అవునూ...ఇక్కడ మెజీషియన్ చేప పిల్లను ఎవరికో ఇస్తున్నాడు. అది ఎవరికో తెలియాలంటే 1 నుంచి 48 వరకు చుక్కలు కలపాలి. మరి పెన్నో పెన్సిలో తీసుకొని కలిపేయండీ.



7 తేడాలు ఏవోచ్?

పై రెండు బొమ్మలూ ఒకేలా కనిపిస్తున్నాయా! అయితే పప్పులో కాలేశారు. రెండు బొమ్మల్లోను 7 తేడాలున్నాయి. మరి అవేంటో గుర్తించండి చూద్దాం.

కవల పీతలేవి?



ఇక్కడ కొన్ని పీతలున్నాయా! అవన్నీ చూడ్డానికి ఒకేలా కన్పిస్తున్నాయా? కానీ వాటిలో రెండు మాత్రమే అచ్చం ఒకేలా వుంటాయి. అంటే కవల పీతలన్నమాట. మరి ఆ రెండూ ఏవేవో చెప్పుకోండి చూద్దాం.

జవాబు: నాలుగు, ఐదు

ఎన్ని బహుమతులో

చిన్నారులూ... క్రిస్టమస్‌కు మీకోసం బహుమతులు ఇవ్వాలనుకొంటున్నాడు ఆర్టిస్టు అంకుల్. అందుకే బోలెడన్ని గిఫ్ట బాక్సులను బొమ్మలో అక్కడక్కడా పెట్టాడు. మరి అవి ఎన్నో చెప్పుకోండి చూద్దాం.

పూలు ఎక్కడున్నాయబ్బా?

పిడుగులూ... ఈ బొమ్మలో కనిపిస్తున్న పాప పేరు బుజ్జి. టీచరుగారి పుట్టినరోజు సందర్భంగా పూల గుత్తి బహూకరించాలనుకొంది. అందుకే అమ్మ దగ్గర డబ్బులడిగి కొనుక్కొచ్చింది కూడా. తీరా దాన్ని తీసుకెళ్లబోయే సమయానికి గుత్తిలో ఒక్క పువ్వు కూడా కనిపించలేదు. ఏమయ్యాయబ్బా... గుర్తించి మొత్తం ఎన్ని పూలో చెప్పుకోండి.

జవాబు: పది పూలు

రంగులు అద్దితే...

పిల్లలూ... ఇక్కడ క్రిస్టమస్ తాత బోలెడన్ని బహుమతులు తీసుకెళుతున్నాడు కదా. మరి ఆయనకు, ఆయన దగ్గరున్న బహుమతులకు రంగులు వేద్దామా.

మాటల కోట - 31

రూపకల్పన : **వెంకట సుబ్బారావు కావూరి**

1		■	2		3	■	4	5
	■	6		■	7		■	
■	8	■	9	10		■	11	■
12		13	■		■	14		15
	■	16		■	17		■	
18	19		■		■	21	22	
■		■	23		24	■		■
25	■	26		■	27		■	28
29		■	30			■	31	

అడ్డం :

1. జలం వాడుకలో (2)
2. మహిళాలోకం నిద్ర లేచిందని పాడే ఎన్టీఆర్ చిత్రం. ఏఎన్నార్ ఇందులో ప్రైవేటు గూఢచారి (3)
4. నాయకుడే. చేతితో వస్త్రం తయారీ కూడా (2)
6. చూచు, ప్రసవించు (2)
7. స్త్రీలు చెవికి ధరించే ఆభరణం దారి మారింది (2)
9. ఆముదపు విత్తనాల నుంచి తీసే చమురు ఎక్కడెక్కడో పడిపోయింది (3)
12. చిన్నదైన, సులభమైన (3)
14. అధికం, ఎక్కువ, పండిన, లేత దశ దాటిన (3)
16. చేప శ్వాసకోశం తిరగబడింది (2)
17. గీత (2)
18. ఒప్పులు కానివి, చేయకూడనివి (3)
21. మేఘాల ఘర్షణతో పుట్టే శబ్దం. మెరుపు జోడు. అటు నుంచి వస్తూ ప్రారంభం అచ్చును మింగి హల్లు చేరింది (3)
23. సమాచారం, వార్త (3)
26. రెండు దిక్కుల నడుమ (2)
27. తుడిచేయు, సాయంకాలం, మురికి (2)
29. మొన్నా కాదు నేడూ కాదు. (2)
30. మూత, ఇంటికి గుమ్మం ఎంతో, ఇదీ అంతే. ఇక్కడ బిగింపులో లోపం (3)
31. రాతకు ప్రకృతి (2)

నిలువు

1. మాంసానికి గ్రామీణ వాడుక (2)
2. తింటే గారెలు తినాలని నానుడి. గారెలకు ఏకవచనంలో మాతృక (3)
3. కింద నుంచి అమ్మకే అమ్మ (3)
5. 18 అడ్డం ఏకవచనం (2)
8. రాయి (2)
10. కింద నుంచి పైకొచ్చిన లావైన, దట్టమైన, చిక్కనైన (2)
11. వేప, కాకరలో సామ్యం (2)
12. యోగ్యత, తగిన (3)
13. పదే పదే ఇబ్బందులు (3)
14. మొహం వాడుకకు అసలు సాగింది (3)
15. సాక్ష్యం, ఆధారం, నిరూపణ (3)
19. కింద నుంచి తృణ ధాన్యాల రెండో రూపం, బద్దలు (2)
22. రుక్మిణిని ముద్దుగా పిలవండి (2)
23. మనస్పర్థ, వ్యాకులత స్థితి (3)
24. చేతి గుడ్డకు మరో పేరు (3)
25. ఖనిజాల క్షేత్రం, ఇది ఒక్కటున్నా కోట్లకు కోట్ల ఆదాయమట (2)
28. కొత్తొక వింత. ఇదొక రోత అని తెలుగు సామెత (2)

మాటలకోట - 30 జవాబు

1 జ	త	■	2 చి	ల	3 క	■	4 క	5 ల్లం
ప్పు	■	6 క	ల్లు	■	7 ని	8 ద్ర	■	ప
■	9 ఉ	క్క	■	10 తా	■	11 ము	12 ప్ప	■
13 వ	రి	■	14 మ	ర	15 పు	■	16 క	17 డు
ర	■	18 కూ	ర	■	19 రా	జీ	■	ము
20 ద	21 ళం	■	22 క	23 ర	ణం	■	24 ఆ	రా
■	25 నా	26 రు	■	వి	■	27 మో	కు	■
28 నం	■	29 తా	30 ళం	■	31 ఈ	డు	■	32 కా
33 ది	నం	■	34 మే	న	క	■	35 తా	జా

మంచి బహుమతి

డిసెంబర్ మాసం.

బాగా చలి వేస్తోంది.. ఎంతగా అంటే ఎముకలు కొరికే చలి..

రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి...

శ్యామ్ వాళ్లింట్లో కూడా చలిగానే ఉంది. చుట్టూతా ప్లాస్టిక్ సంచులతో కూడిన గోడలు.. పైన కూడా ప్లాస్టిక్ సంచి వేసి, దానిపై ఎండిన కొబ్బరిమట్టలు, చిన్న చిన్న నాపరాళ్ల ముక్కలు ఉంచారు. గాలికి అది ఎగిరిపోకుండా. ఆ కప్పులోంచి పగటిపూట ఎండ.. సాయంత్రం చలి లోపలే ఉన్నట్లు ఉంటాయి.

శ్యామ్ వాళ్ల అమ్మ వాడికో చిరుగుల దుప్పటి ఇచ్చింది. ఆమెకూడా ఓ పలుచని చీకిపోయిన చీర కప్పుకొంది. గదిలో ఓ మూల చిరిగిన చాపపై ముడుచుకొని పడుకున్నది. శ్యామ్ కోసం మరో చిరుగుల చాప ఉంది వాళ్లింట్లో..

పొద్దెక్కుతున్న కొద్దీ చలి బాగా పెరిగిపోతోంది. కాళ్లూచేతులూ గజగజ వణికిపోతున్నాయి. పళ్లు పటపటా కొట్టుకుంటున్నాయి.

శ్యామ్‌కి ఓ మధ్యరాత్రి మెలకువ వచ్చింది. కడుపు బిగపట్టుకొని అటూ ఇటూ దొర్లుతున్నాడు. ఎంతకీ నిద్రపట్టడం లేదు. కళ్లుతెరిచి వాళ్ల అమ్మ వైపు చూశాడు. నిద్రలోనే ఆమె వణుకుతోంది.

శ్యామ్ లేచి తను కప్పుకున్న దుప్పటిని వాళ్ళ అమ్మకు కప్పాడు.

రోజూ తను ఒళ్లు తుడుచుకునే చిరుగుల తువ్వాలుని తలచుట్టూ చెవులమీదుగా చుట్టుకున్నాడు. తలుపు తీసి, బయటకు నడవసాగాడు.

ఎదురుగా ఉన్న ఓ ఇంటి ముందున్న క్రిస్‌మస్‌ట్రీకి నక్షత్రం వేలాడుతోంది. 'ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగు చుక్కల చుక్కల కాగితం' లోపల కరెంటు బల్బు. నక్షత్రం వెలిగిపోతోంది. 'బల్బు వెచ్చగా ఉంటుంది!' అంది మనస్సు. శ్యామ్ ముఖంలో చిరునవ్వు మెరిసింది. రోడ్డు దాటి ఆ నక్షత్రం కిందకు వెళ్లి నిలబడ్డాడు.

ఇంతలో... గణగణ శబ్దం చేస్తూ ఓ బండి శ్యామ్ వద్దకు వచ్చి ఆగింది. అది ఎటు నుండి వచ్చిందో శ్యామ్‌కు తెలీనేలేదు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఆ బండికి ముందు నాలుగు జింకలు కట్టి ఉన్నాయి. అవే ఆ బండిని లాగుతున్నాయి. అవి భలే ముద్దొస్తున్నాయి. వాటి కళ్లు మెరుస్తున్నాయి.



ఆ బండిలో కూర్చున్న తాత చాలా వింతగా ఉన్నాడు. ఎర్రటి కోటు వేసుకున్నాడు. ఎర్రటి టోపీ పెట్టుకున్నాడు. ఆ టోపికీ మధ్య నుండి కొంచెం పొడవుగా వేలాడుతూ చివర బంతిలాగా ఉంది. పొడవాటి తెల్లగడ్డం, పెద్ద పెద్ద మీసాలు. అవీ తెల్లగానే ఉన్నాయి.

శ్యామ్ అలానే చూస్తూ ఉన్నాడు.

'ఓయ్... బాగున్నావా? 'హేపీ క్రిస్‌మస్'! అన్నాడా తాత. బండిలోంచి ఒక పెద్ద ప్యాకెట్టును తీసి శ్యామ్‌కి ఇచ్చాడు.

'మీరు క్రిస్మస్ తాత కదూ! బహుమతి ఇవ్వాల్సింది నాకు కాదు. ఈ ఇంట్లో ఉండే పీటర్‌కు! ఈ నక్షత్రాన్ని, క్రిస్మస్ చెట్టును పెట్టింది పీటరే..!' అన్నాడు శ్యామ్.

'ఓహో... అలాగే...' అని నవ్వాడు తాత. 'అయినా ఫర్లేదులే.. ఈ బహుమతి మాత్రం నీకే...' అన్నాడు.

'మరి పీటర్ కి...?' ప్రశ్నించాడు శ్యామ్..

తాత కళ్లు సంతోషంతో వింతగా మెరిశాయి... అలా శ్యామ్ వైపు చూస్తూ చేయి ఊపాడు...

'అయ్యో.... మళ్ళీ పీటర్ లేచి తన బహుమతి కోసం వెతుక్కుంటాడు. నాకేమీ అక్కర్లేదు తాతా.... నేను డబ్బులు సంపాదించి వచ్చే ఏడాది నక్షత్రం పెడతా.. అప్పుడు తీసుకుంటా బహుమతి... ' అంటూనే ఉన్నాడు శ్యామ్.. తాతా, బండి ఏమయ్యాయో తెలియలేదు... అక్కడ లేవు... ఎటు చూసినా కనపడలేదు..

శ్యామ్ విచారంగా తన చేతిలోని బహుమతికేసి చూసుకున్నాడు. ప్యాకెట్టు ఎర్రటి పేపరుతో మెరిసిపోతున్నది. దానికి కట్టిన పచ్చ రిబ్బను చాలా ముద్దొస్తోంది. దాన్ని పట్టుకొని ఒక అడుగు తన ఇంటివైపు వేశాడు..' 'ఊహూ వద్దు. ఇది నీకు కాదు.. పీటర్‌కే..' అంది మనస్సు. 'పాపం! వాడు ఈ బహుమతి కోసమే కదా నక్షత్రం తెచ్చి పెట్టాడు. క్రిస్మస్ చెట్టూ పెట్టాడు.. అన్నీ చేశాడు.. అందుకే ఇది పీటర్‌కే...' అనుకుంటూ శ్యామ్.. ఆ బహుమతిని క్రిస్మస్ చెట్టుకింద పెట్టేశాడు. వెనక్కి తిరిగి చూడకుండా గబగబా తన ఇంటికి వచ్చేశాడు.

ఇంటి తలుపు తెరవగానే వాడి కళ్లల్లో గొప్ప ఆశ్చర్యం.. నోట మాట రావడం లేదు.. నోరంతా తెరిచి అలాగే చూస్తున్నాడు. శ్యామ్ చాప మీద ఇంకా పెద్ద ప్యాకెట్టు ఒకటి పెట్టి ఉంది.

ప్యాకెట్టుకు రంగు రంగుల బొమ్మల పేపరు చుట్టి ఉంది. దానికి ఆకుపచ్చ, నీలం రంగులో రిబ్బన్లు కట్టి ఉన్నాయి. అవి భలే మెరుస్తున్నాయి.. అన్నింటికన్నా దానిపై ఓ వాక్యం రాసి ఉన్న పేపరు అంటించి ఉంది. దగ్గరకు వెళ్లాడు. 'నీ సౌహార్ద్రతకు మెచ్చి.. ఈసారికి నేనిచ్చే బహుమతి ఇది.. వచ్చేసారి ఇంకా మంచి బహుమతి తెస్తాను..!' అని రాసి ఉంది.

ప్యాకెట్టును ఒణుకుతున్న చేతులతో అలా నిమిరాడు శ్యామ్.. దాన్ని పట్టుకుని గుండెలకు హత్తుకున్నాడు. కొంచెం బరువుగా కూడా అనిపించింది. తెరిచి చూశాడు. లోపల రెండు వెచ్చని రగ్గులు కొత్తవి.. చక్కగా మడతపెట్టి ఉన్నాయి!

శ్యామ్ ఎంతో ఆనందపడ్డాడు. తన అవసరాన్ని తీర్చే బహుమతి లభించింది అని మురిసిపోయాడు. ఇంత కన్నా మంచి బహుమతి ఏముంటుంది...?!

శ్యామ్ మనస్సు సంతోషంతో నిండిపోయింది. క్రిస్మస్ తాతకు మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

- శాంతిశ్రీ

సూపర్ కటింగ్

ఏంటి బాస్! 'ఈ ఫొటోలు...ఈ కటింగు!!' అనుకొంటున్నారా? అదే లియాంగ్ స్పెషల్. దీనికి ప్రత్యేకమైన కత్తెరలు, దువ్వెనలు అవసరమే లేదు. పొడవాటి కొడవలి వుంటే చాలు. కొడవలి పిడి పట్టుకొని చకచకా ఎలా క్రాఫ్ చేసేస్తున్నాడో చూడండి. 'మధ్యలో కొప్పు బానే వుంది బాస్. మరి దాని చుట్టూ వెంట్రుకలన్నీ అలా గీకేస్తున్నాడేంటి?' అంటున్నారా? అది డోంగ్‌ఝాయ్ గ్రామస్తుల ప్రాచీన సంప్రదాయం. ముందుగా టీ కెటిల్ లాంటి దాంతో నెత్తి మీద నీళ్లు పోస్తాడు. తలంతా తడిచాక సరిగ్గా నడి నెత్తి మీది వెంట్రుకలను ముడిపెడతాడు. ఇక దాని చుట్టూ వున్న వెంట్రుకలను నున్నగా గీకేస్తాడు. సూపర్ కటింగ్ కదూ. ఏంటలా నవ్వుతున్నారు? 'ఇదేం కటింగ్ అనా!' ఇప్పుడు మన కుర్రకారు వేసుకొనే వెరైటీ క్రాపుల్లాంటిదే బాస్ ఇది కూడా. కాకపోతే కూసింత పురాతనమైనదంతే!